



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 286 | ది. 25-1-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 286 | Date : 25-1-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


# క్రెడిట్ చోరీ అంటున్న వారికి ఏం క్రెడిట్ ఉంది?

- నరకాసురుడు లాంటి వ్యక్తి మళ్లీ వస్తే నాశనమే
- ల్యాండ్ టైటిల్లింగ్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తుల్ని కాపాడాం
- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అమరావతి అభివృద్ధి ఆగదు
- స్వచ్ఛాంధ్రలో భాగంగా రూ. 573 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు
- వచ్చే ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలు
- చిత్తూరు జిల్లా నగరిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు







**నగరి,జనవరి 24 (వార్తాప్రభ) :** నేరస్తులు రాజకీయాలు చేస్తే ఏమవుతుందో గత ఐదేళ్లు చూశామని, మంచి-చెడుకి వ్యత్యాసం ఏంటో ప్రజలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. చెడ్డ వ్యక్తులను ప్రోత్సహిస్తే సమాజానికి హాని జరుగుతుందని, స్వచ్ఛమైన ఆలోచనలు ఉంటేనే భవిష్యత్ బాగుంటుందని అన్నారు. చిత్తూరు జిల్లా నగరిలో స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వ్యర్థాల సేకరణ కోసం ఉద్దేశించిన స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లతో పాటు మెప్మా, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. పలువురు పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ సన్మానించారు. అనంతరం ప్రజా వేదిక సభలో పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ" నగరిలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఏడాది క్రితం ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా ప్రారంభించాం. స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం కాదు...ఇది మన జీవన విధానం కావాలి. అందుకే ప్రతి నెలా 3వ శనివారం నాతో సహా నేతలు, అధికార యంత్రాంగం హాజరవుతున్నాము. సమైక్యాంధ్రలో ముఖ్యమంత్రిగా జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాను. స్వచ్ఛాంధ్రలో కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో మొత్తం రూ.573 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుపుకుంటున్నాం. స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0లో భాగంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కింద 101 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్?మెంట్ ప్రాజెక్టులను రూ.510 కోట్లతో చేపడుతున్నాం. రూ.2.21 కోట్ల విలువైన 9,048 హోం కంపోస్టింగ్ బిన్స్ హౌస్ హోల్డ్ వేస్ట్ ప్రాసెసింగ్ కోసం మెప్మా ఆర్పీలకు సమకూర్చడం జరిగింది. గ్రామాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ కోసం స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ 2.0 కింద రూ.6.7 కోట్లతో 200 వ-ఆటోలు, 12,000 ట్రైసైకిళ్లు, 5,000 పుష్‌కార్ట్స్ సిద్ధం చేశాం. గతేడాది నుంచి స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద విస్తృతంగా పరిశుభ్రతా డ్రైవ్?లు చేపట్టాం. లెగసీ వేస్ట్ తొలగింపులో రికార్డులు సృష్టించాం. పట్టణాల్లో ఇప్పటి వరకు 105 లక్షల మెట్రిక్ టన్నుల పాత చెత్త తొలగించాం. గ్రామీణ ప్రాంతాల్లో 7 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను క్లియర్ చేస్తున్నాం. మార్చి 2026 నాటికి లెగసీ వేస్ట్ తొలగింపులో 100 శాతం లక్ష్యం చేరుకుంటాం. పట్టణాలో 97.26 శాతం ఇళ్ల నుంచి డోర్ టు డోర్ వేస్ట్ కలెక్షన్ చేస్తుండగా, అన్ని పంచాయతీల్లో వ్యర్థాల సేకరణ జరుగుతోంది. 62 శాతం ఇళ్లకు వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. ఈ మార్చి నాటికి పంచాయతీలు, పట్టణాల్లో 100 ఇళ్ల నుంచి డోర్ టు డోర్ కలెక్షన్ ఉంటుంది. వచ్చే నెలలో కర్నూలు, రాజమండ్రి, కడప, నెల్లూరులో 4 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను పీపీపీ మోడల్‌లో చేపడుతున్నాం. రెండేళ్లలో ఇవి ఉత్పత్తి మొదలు పెడతాయి. విజయవాడ, తిరుపతికి కూడా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ప్రతిపాదనలు ఉన్నాయి. ఇవి కార్యరూపం దాల్చితే ప్రజలకు డంపింగ్ యార్డ్ సమస్య ఉండదు. కాలుష్యం కూడా తగ్గుతుంది. సంపద తయారీ కేంద్రాలను 10,790 వరకు ఏర్పాటు చేశాం. స్వయం సహాయ సంఘాల భాగస్వామ్యంతో కంపోస్ట్ తయారవుతోంది. దాన్ని రైతులకు సరఫరా చేస్తాం. స్వచ్ఛ రథాలతో మీ ఇళ్లలోని డ్రై వేస్ట్, ప్లాస్టిక్, కాగితాలు వంటివి తీసుకుని నిత్యావసరాలు ఇస్తున్నాం. ఇప్పటివరకు 30 స్వచ్ఛరథాలు ఉన్నాయి. మరో 70 మార్చి నాటికి ప్రవేశ పెడతామని ముఖ్యమంత్రి తెలిపారు.

**ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ..** ప్రజలందరి సహకారంతో ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తయారుచేయాలని సంకల్పించాం. 2018లోనే ఓడీఎఫ్ రాష్ట్రంగా ఏపీని నిలిపాం. ఇప్పుడు ఓడీఎఫ్ ప్లస్ రాష్ట్రంగా ఈ మార్చికి తీర్చిదిద్దుతాం. రాష్ట్ర సచివాలయంతో సహా 17 పట్టణ, నగరపాలక సంస్థల కార్యాలయాలు ఇప్పుడు పూర్తిగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపేశాయి. ఈ ఘనత సాధించిన విశాఖ, విజయవాడ, తిరుపతి, కాకినాడ, రాజమండ్రి, పాలకొండ, రాజాం, బొబ్బిలి, సత్తెన్నపల్లి, కుప్పం, చిత్తూరు, మార్కాపురం, సాలూరు, నరసరావుపేట, చిలకలూరిపేట, పుంగనూరు, పలమనేరు మున్సిపల్ కార్యాలయాలను అభినందిస్తున్నాను. ఐటీసీ సంస్థ భాగస్వామ్యంతో వెల్ బీయింగ్ అవుట్ అఫ్ వేస్ట్ అనే కార్యక్రమం కింద పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో పరిశుభ్రత, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా ముస్తాబు కార్యక్రమం అమలు చేస్తున్నాం. ఈ-వేస్ట్ కలెక్షన్ పాయింట్లు ఏర్పాటుచేసి 47 పట్టణ ప్రాంతాల నుంచి 30 టన్నుల ఈ-వేస్ట్ ఇప్పటి వరకు సేకరించాం. 13 నగరాల్లో రోడ్లు శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా 71 భారీ సర్వీసింగ్ మిషిన్లు వినియోగిస్తున్నాం. రోజుకు 108 మిలియన్ లీటర్ల మురుగు నీటి శుద్ధి కోసం 20 పట్టణ ప్రాంతాల్లో 33 ప్లాంట్లు చేపడుతున్నాం. త్వరలో మరో 82 ప్లాంట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తాం. పుత్తూరు, నగరిలో నూటికి నూరు శాతం డ్రైన్స్ పూర్తి చేస్తాం. 111 గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం జరుగుతోంది.

# అమరావతిలో జ్యోతిరావు పూలే స్మృతి వనం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- ఏప్రిల్ 11న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన
- అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్ల ఏర్పాటు
- అవసరమైన చోట్ల బీసీ స్టడీ సర్కిళ్ల నిర్మాణం
- త్వరలో బీసీ రక్షణ చట్టానికి తుదిరూపం
- బీసీల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సవిత
- పలు బీసీ సంఘాల ప్రతినిధులతో మంత్రి సవిత భేటీ



**విజయవాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** అమరావతిలో మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి వనం నిర్మించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. వచ్చే ఏప్రిల్ 11వ జ్యోతిరావు పూలే 200ల జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పూలే స్మృతి వనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్ లు నిర్మించనున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లు లేనిచోట్ల నూతన స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల బాగు కోరుకునేది కూటమి ప్రభుత్వమేనని, బీసీలు ఆత్మగౌరవంతో జీవనం సాగించేలా చట్టాలతో పాటు పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పలు బీసీ సంఘాల నేతలతో విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ మంత్రి సవిత శనివారం సమావేశమయ్యారు. 19 నెలల కూటమి పాలనలో బీసీల అభ్యున్నతికి అమలు చేసిన పథకాలతో పాటు త్వరలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. ఏయే పథకాలు అమలు చేస్తే బీసీలకు మరింత ఆర్థిక దన్ను లభిస్తోందో సంఘాల వారీగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను మంత్రి సవిత దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, టీడీపీతోనే బీసీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ గుర్తింపు లభించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. మహిళలకు, బీసీలకు పాలనలో భాగస్వాములను చేసిన ఘనత ఎన్టీఆర్ దేనన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలను అక్కున చేర్చుకున్నారన్నారు. బీసీల కుల వృత్తుదారులకు భరోసా ఇచ్చేలా సీఎం చంద్రబాబునాయుడు ఆదరణ, ఆదరణ 2.0 అమలు చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో, త్వరలో రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకం అమలు చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

**అమరావతిలో జ్యోతిరావు పూలే స్మృతి వనం..** అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి వనాన్ని అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత ప్రకటించారు. వచ్చే ఏప్రిల్ 11వ తేదీన జ్యోతిరావు పూలే 200వ జయంతి భారీ ఎత్తున నిర్వహించనున్నామన్నారు. అదే రోజు జ్యోతిరావు పూలే స్మృతి వనానికి సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నామన్నారు. అమరావతిలో అయిదెకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ బీసీ స్టడీ సర్కిల్ కు మహాత్మా జ్యోతిరావు పూలే పేరు పెట్టనున్నామన్నారు. 28 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవనాలు నిర్మించనున్నామన్నారు. ఈ భవనాల కోసం ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లకు స్థలాలు కేటాయించాలని ఆదేశించామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లు లేని జిల్లాలో నూతన స్టడీ సర్కిళ్లు నిర్మిస్తున్నామన్నారు. అమరావతిలో అయిదెకరాల్లో రాష్ట్ర స్థాయి బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

**త్వరలో బీసీ రక్షణ చట్టం..** బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో భాగంగా బీసీల ఆత్మగౌరవానికి భంగం కలగనీయకుండా త్వరలో బీసీ రక్షణ చట్టం తీసుకురానున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ చట్ట రూపకల్పనకు తుది రూపు ఇస్తున్నట్లు తెలిపారు. బీసీలకు మేలు చేసేలా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకం వల్ల ఎక్కువగా లబ్ధి పొందినది బీసీ బిడ్డలేనన్నారు. బీసీ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# సింగరేణిపై విషపురాతలు : భట్టి విక్రమార్క

- ఎవరికి లబ్ధి చేకూర్చడానికో ప్రజలకు తెలియాలన్న ఉప ముఖ్యమంత్రి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు వెల్లడి
- రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ప్రకటన



**హైదరాబాద్,జనవరి 24 (వార్తాప్రభ) :** సింగరేణి ఆస్తులను కొంతమందికి కట్టబెట్టే ప్లాన్ తో, కార్మికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా విషపు రాతలు రాస్తున్నారంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషపు రాతల వల్ల రాష్ట్రానికి, సింగరేణికి నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఈరోజు ఉదయం ప్రజాభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సింగరేణిపై అసత్య ప్రచారాల వెనక కుట్ర దాగి ఉందని, సింగరేణి ఆస్తులు కాజేసే ప్లాన్ ఉందని ఆరోపించారు. టెండర్లపై అపోహలు సృష్టించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎవరి ప్రయోజనాల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ఆయన చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ రాయడాన్ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ జరిపిస్తానని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిపై కిషన్ రెడ్డి పరిశీలిస్తేనే నిజాలు బయటపడతాయని చెప్పారు.

# సమ్మక్క జాతరకు పోలీస్ కవచం!!

- భక్తులకు ఇబ్బంది కలగొద్దు, మహిళల భద్రతే ముఖ్యం
- సిసి కెమెరాలు, బారికేడ్లతో పటిష్ట బందోబస్తు
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా





**పెద్దపల్లి /గోదావరిఖని,జనవరి 24 (వార్తాప్రభ) :** గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శనివారం గోదావరి బ్రిడ్జ్ సమీపంలోని జాతర ప్రాంగణాన్ని పోలీస్ అధికారులతో కలిసి సందర్శించిన ఆయన, భక్తుల భద్రత, రక్షణ చర్యలు అలాగే ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మహిళల భద్రత కోసం సిసి కెమెరాల ఏర్పాటుతో పాటు కొత్తగా నిర్మించిన బారికేడ్లను పునఃపరిశీలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల గద్దెలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న సీపీ, వాహనదారులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమేష్, వివిధ విభాగాల ఇన్స్పెక్టర్లు అలాగే ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.


## పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయున దేమనగా, నా క్లయింటు అయిన ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం, చనుబండ గ్రామ కాపురస్తులు కొత్తగుండ్ల ప్రసాదరావు గారి కుమారుడు కొత్తగుండ్ల విశ్వనాథ్ గారి తరపున నా క్లయింటు తల్లిగారైన కొత్తగుండ్ల ఇందుమతి గారి పేరిట ఆమె భర్తగారైన కొత్తగుండ్ల ప్రసాదరావు గారు ది.29-09-2005వ తేదీన విస్సన్నపేట సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో నెం.3765/2005గా రిజిస్ట్రేషన్ కాబడిన ఒరిజినల్ గిఫ్ట్ డీడ్‌ను తీసుకొని ది.22-12-2025వ తేదీన చనుబండ గ్రామములోని జిరాక్సు సెంటర్‌కు వెళ్లుచుండగా మార్గమధ్యంలో సదరు దస్తావేజు కలిగిన కవరు జారివడిపోయినది. వెంటనే మార్గమధ్యంలో ఎక్కడ వెతకినా కనిపించలేదు. అంతేగాని నా క్లయింటు సదరు దస్తావేజును ఏవిధముగానూ దుర్వినియోగము చేయలేదని మరియు ఎవరికి తాకట్టు పెట్టుటగానీ, మరేవిధమైన అన్యాక్రాంతములు చేయలేదని ఇందు మూలముగా తెలియ జేయుటమైనది. ఎవరికైనా దొరికిన యెడల నాకుగానీ, నా క్లయింటుకు గానీ వారం రోజులలోపుగా తెలియవరచగలరు. ఎవరైనా సదరు దస్తావేజును దుర్వినియోగ వరచిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బద్ధులు కాగలరు.

**DODLA LAKSHMANA RAO**
Advocate & Notary
#21-10/1-125/F, 2nd Line, Teachers Colony,
Mutyalampadu, Vijayawada-520011,
**Cell: 9440326897**


# రాష్ట్ర మహిళా ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలిగా డాక్టర్ పామర్తి లీలావతి





**విజయవాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** రాష్ట్ర మహిళా సంఘ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ లీలావతి ఎంపికయ్యారు. శనివారం విజయవాడ విద్యాదరపురంలోని రాష్ట్ర ఉద్యోగుల సంఘ భవనంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘ అధ్యక్షులు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ పామర్తి లీలావతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన అధ్యక్ష పదవికి ఎటువంటి బేషజాలు లేకుండా నిబద్ధత తో ఉద్యోగుల సమస్యల కోసం నిజాయితీ గా పోరాడుతానని అన్నారు. ఏపీజీఇయే మహిళా శాఖ కు అధ్యక్షత వహించే గురుతరమైన బాధ్యత అప్పగించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సమస్య ల పరిష్కారం కోసం, సాధికారత వైపు అడుగులు వేసే కర్తవ్యాన్ని విజయవంతం గా ముందుకు తీసుకు వెళతానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మహిళలు లక్షాధికారులు కావడమే లక్ష్యం!!

- 50 వేల నుండి కోటి వరకు రుణాలు
- సంక్షేమ పథకాలు గడపగడపకూ చేరాలి
- ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి/ గోదావరిఖని,జనవరి 24 (వార్తాప్రభ) :** మహిళలు లక్షాధికారులు కావడమే లక్ష్యం అని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎన్టీపీసీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేద మహిళలందరినీ స్వశక్తి సంఘాల్లో చేర్చాలని, స్వయం ఉపాధి కోరుకునే వారికి సింగరేణి సంస్థ ద్వారా శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు మహిళా సంఘాలకు ప్రభుత్వ స్థలం, సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. మహిళలు రూ. 50 వేల నుండి కోటి వరకు రుణాలు పొందే వెసులుబాటు ఉందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత గంజాయి వంటి వ్యసనాలకు బానిస కాకుండా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ అరుణ శ్రీ మాట్లాడుతూ.. ఈ ఏడాది 284 సంఘాలకు రూ. 28.09 కోట్లు, 13,503 మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు జాతీయ ఓటర్ల దినోత్సవం పై అవగాహన






**శేరిలింగంపల్లి,జనవరి 24 (వార్తాప్రభ)**:శేరిలింగంపల్లి బి.హెచ్.ఇ.ఎల్ టౌన్ షిప్ లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు జాతీయ ఓటర్ల దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ప్రజాస్వామ్య వ్యవస్థకు ఊపిరి పోయడానికి ఓటు హక్కు ఆయుధం లాంటిదని అని అన్నారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత అధ్యక్షత వహించారు. అలాగే ముఖ్య అతిథిగా డాక్టర్ పూలపల్లి వెంకటరమణ (విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్) విచ్చేసి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ::భారత ఎన్నికల కమీషను స్వతంత్ర భారత దేశంలో ఎన్నికలను సజావుగా,నిష్పక్షపాతముగా నిర్వహించేందుకు రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేసిన సంస్థ అన్నారు. 1950 జనవరి 25న ఏర్పాటు చేయబడిన ఈ కమీషను సుప్రీంకోర్టు వలెనే రాజ్యాంగం ఏర్పరచిన స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ..ఇది ప్రభుత్వ నియంత్రణకు లోబడి ఉండదన్నారు. దేశంలో రాష్ట్రపతి,ఉప రాష్ట్రపతి,లోక్ సభ,రాజ్యసభ,రాష్ట్రాల శాసనసభలు,శాసనమండళ్ళకు జరిగే ఎన్నికలను ఈ కమీషన్ నిర్వహిస్తుంది.వీటి ఎన్నికల నిర్వహణలో పర్యవేక్షణ, మార్గనిర్దేశకత్వం,నియంత్రణ చేయవలసిన బాధ్యతలను రాజ్యాంగం కమీషనుపై ఉంచింది ఉంచింది అని అన్నారు.ఈ సందర్భంగా అందరిచేతా ఓటుహక్కును పొందుతామని మరియు నుఓటింగులో పాల్గొని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థులను ఎన్నుకుంటామని :: ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అభిజిత్,అధ్యాపకులు డాక్టర్ అనురాధ,ప్రజ్వల, జనార్దన్ మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి,శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు గొప్ప వరం ముఖ్యమంత్రి సహాయ నిధి

*శాసనసభ్యులు అరికెపూడి గాంధీ*



**శేరిలింగంపల్లి,జనవరి 24 (వార్తాప్రభ)**:శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపి నగర్ కాలనీ కి చెందిన భరత్ రావు కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ ద్వారా మంజూరైన 2,50,000/- రెండు లక్షల యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన సీఎంఆర్ఎఫ్-ఎల్ఓసీ మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి పిఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అందచేశారు.ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని అన్నారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్,ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,అన్వర్ షరీఫ్,దామోదర్ రెడ్డి,కరుణాకర్ గౌడ్,సత్యనారాయణ,బ్రిక్ శ్రీనివాస్,అనిల్ కావూరి మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ ఐ ఆర్ పెన్షనర్స్ అసోసియేషన్ జోనల్ కార్యాలయం ప్రారంభం




**హైదరాబాద్ : జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్ ఐ ఆర్ పెన్షనర్స్ అసోసియేషన్ జోనల్ కార్యాలయం ను డాక్టర్ శంకర్ రావు శనివారం ప్రారంభించారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు రైల్వే పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మజ్దూర్ యూనియన్ వైస్ చైర్మన్ రైల్ నిలయం బ్రాంచ్ జెడ్ ఆర్ యూ సి సి మెంబర్ నూర్, ఇతర నాయకులు, ప్రెసిడెంట్ డాక్టర్ శంకర్ రావు, ప్రధాన కార్యదర్శి యుగంధర్ ను ఘనంగా సన్మానించారు. వి అరుణ్ కుమార్. భాగ్యవతి పి బి. ఎన్ ప్రసాద్. మూర్తి , రఘు తదితరులు ఈరోజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అజ్ఞాత జీవితంకు స్వస్తి!!

● జనజీవన స్రవంతిలోకి 8మంది మావోయిస్టులు ● మిలీషియా సభ్యుల లొంగుబాటు వివరాలు తెలిపిన సీపీ





**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**అజ్ఞాత జీవితాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ఎనిమిది మంది మావోయిస్టు మిలిషియా సభ్యులు శనివారం రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝా ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో జగిత్యాల జిల్లాకు చెందిన కోరియర్ ధర్మాజీ శ్రీకాంత్ (33)తో పాటు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన మిలీషియా కమాండర్ పొడియం కాములు (30), సాంస్కృతిక విభాగం సభ్యుడు ముడియం జోగ (25), పార్టీ మెంబర్ కుంజం లక్కె (23), మిలీషియా సభ్యులు మోదం భీమ (30), ముడికం సుక్రం (25), ముడియం మంగు (50), జిఏడి కమాండర్ కుంజం ఉంగా (28) ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకాలు, పోలీసుల ఆదరణను చూసి, తమ కుటుంబాలతో ప్రశాంత జీవనం గడపాలని వీరు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ తెలిపారు. లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని రకాల సహాయ సహకారాలు, జీవనోపాధి కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ::పోరు వద్దు – ఊరు ముద్దు:: అనే నినాదంతో అజ్ఞాతంలో ఉన్న ఇతర మావోయిస్టులు కూడా ఆయుధాలు వీడి సమాజంలో కలవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ ప్రతాప్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# రామగుండం కోటపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే!!

● ప్రజా పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం ● ఐక్యతతోనే రామగుండం అభివృద్ధి సాగుతోంది
● కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు ● ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**రానున్న మున్సిపల్ ఎన్నికల్లో రామగుండం కోటపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి నాయకులను ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ........ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నది తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. రామగుండాన్ని గత పాలకులు దోచుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కోట్ల రూపాయలతో నియోజకవర్గ సుందరీకరణ జరుగుతోందని తెలిపారు. ఐక్యతతో పనిచేసి రామగుండంలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మహిళా విభాగం, సోషల్



మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికలలో పోటీ చేస్తా

## గౌతమ్ నగర్ డివిజన్ నుంచి బరిలో ఉంటా : ఠాగూర్ అరుణ్ సింగ్

**హైదరాబాద్ జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రానున్న జిహెచ్ఎంసి కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయాలని తన అభిమానులు కోరుతున్నట్లు ప్రముఖ సంఘ సేవకులు ఠాగూర్ అరుణ్ సింగ్ తెలిపారు. జయగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ గా తాను చేసిన సేవా కార్యక్రమాలతో గౌతం నగర్ డివిజన్ ప్రజల్లో తనకు మంచి గుర్తింపు వచ్చిందని అరుణ్ సింగ్ అన్నారు. గౌతమ్ నగర్ ప్రజలు, అభిమానులు కోరిక మేరకు కార్పొరేటర్ పోటీ చేస్తానని.. గెలిపిస్తే డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఆలయ చైర్మన్ గా తాను చేసిన సేవా కార్యక్రమాల పట్ల సంతోషంగా ఉన్న గౌతమ్ నగర్ డివిజన్ ప్రజల ఆశీస్సులు తనకు పుష్కలంగా ఉన్నాయన్నారు. స్థానిక యువతతో పాటు అన్ని వర్గాల ప్రజల అండదండలు ఉన్నాయని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా గౌతమ్ నగర్ డివిజన్ లో సేవా కార్యక్రమాలతో పాటు ఆలయాల అభివృద్ధి, గణపతి నవరాత్రి ఉత్సవాలు, దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు, పేద విద్యార్థులకు చదువు కోసం సహాయం, పేద మహిళల వివాహానికి తమ వంతు సహాయ సహకారాలు అందించానని గుర్తు చేశారు. గౌతమ్ నగర్ డివిజన్ లో రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా అందరికీ తలలో నాలుకలా వ్యవహరిస్తూ.. ఎన్నో కార్యక్రమాలు నిర్వహించానని పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలతో పాటు సంపన్నుల అండదండలు తమకు ఉన్నాయని పేర్కొన్నారు.



రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో ఏ పార్టీ తమకు టికెట్ ఇచ్చినా గెలిచి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజులలో ప్రజల సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలతోతమ వంతు కృషి చేస్తానని తెలిపారు .

# రాష్ట్ర స్థాయిలో "రిక్షిత" ప్రతిభ!!

● లింగాపూర్ మోడల్ స్కూల్‌కు గర్వకారణం ● విద్యార్థినిని అభినందించిన ప్రిన్సిపాల్ పి.సదానందం



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**లింగాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని వై.రిక్షిత రాష్ట్ర స్థాయి ఈ.ఎల్.టి.ఏ. ఒలింపియాడ్ (జూనియర్స్) పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. 8వ తరగతి చదువుతున్న రిక్షిత సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ పి. సదానందం, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను ఘనంగా అభినందించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శనం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ::రిక్షిత:: ప్రతిభ లింగాపూర్ మోడల్ స్కూల్‌కు గర్వకారణం అని ప్రశంసించారు. ఉపాధ్యాయుల సరైన మార్గదర్శకత్వంలో విద్యార్థులు కష్టపడితే అసాధ్యమైనది ఏదీ లేదని ఆయన పేర్కొన్నారు.



మోడల్ స్కూల్స్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అలాగే వారిలోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తాయని, ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు గొప్ప స్ఫూర్తినిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# జీహెచ్ఎంసీలో భారీగా అధికారుల బదిలీలు

## జీడిమెట్ల, గాజులరామారం సర్కిళ్లకు కొత్త ఉప కమిషనర్లు

● యూసఫ్‌గూడ నుంచి జీడిమెట్లకు శంకర్ సింగ్..● గాజులరామారం బాధ్యతల్లో శ్రీపాద రామేశ్వర్..
● ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ ఆర్.వి. కర్ణన్

**కుత్బుల్లాపూర్ జనవరి 23 (వార్తాప్రభ)** : జీహెచ్ఎంసీ పరిధిలో పలు సర్కిళ్ల ఉప కమిషనర్లను బదిలీ చేస్తూ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడిమెట్ల మరియు గాజులరామారం సర్కిళ్ల అధికారులలో స్థానచలనం కలిగింది. **జీడిమెట్ల సర్కిల్ (సర్కిల్-25)**:జీడిమెట్ల సర్కిల్ ఉప కమిషనర్‌గా ఇప్పటివరకు విధులు నిర్వహించిన వి. నర్సింహ ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో డి. శంకర్ సింగ్ ను నూతన ఉప కమిషనర్‌గా నియమించారు. శంకర్ సింగ్ గతంలో యూసఫ్‌గూడ సర్కిల్ ఉప కమిషనర్‌గా పనిచేశారు.
**గాజులరామారం సర్కిల్ (సర్కిల్-26)**:గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ ఎల్.పి. మల్లయ్య ను ఎన్నికల అనుబంధ కమిషనర్‌గా



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గాజులరామారం నూతన ఉప కమిషనర్‌గా శ్రీపాద రామేశ్వర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. బదిలీ అయిన అధికారులు త్వరలోనే తమ కొత్త సర్కిళ్లలో బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# మైనర్ డ్రైవింగ్ ప్రాణాంతకం!!

*తల్లిదండ్రులు హెల్మెట్ ధరించేలా చూడటం పిల్లల బాధ్యత*
*సురక్షిత ప్రయాణం అందరి లక్ష్యం*
*గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి*



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**మైనర్ డ్రైవింగ్ ప్రాణాంతకం అలాగే చట్టరీత్యా నేరమని గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి విద్యార్థులకు సూచనలు చేశారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల నేపథ్యంలో అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా గుడ్ మార్నింగ్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో తల్లిదండ్రులు హెల్మెట్, సీట్ బెల్ట్ కచ్చితంగా ధరించేలా చూడాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని గుర్తుచేశారు. మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, ట్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడటం వంటివి ప్రాణాలకే ప్రమాదకరమని, ఇవి చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రతి వాహనానికి రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ఈ విషయంలో విద్యార్థులు తమ తల్లిదండ్రులను చైతన్యపరచాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చిన ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. అనూష, స్కూల్ డైరెక్టర్ సమ్మా రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మేడారంకు 115 ప్రత్యేక బస్సులు!!

*24 గంటల సేవలు - భారీ సిబ్బంది కేటాయింపు*
*గోదావరిఖని డిపో మేనేజర్ ఎం. నాగభూషణం*

**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**మేడారం సమ్మక్క సారలమ్మ జాతర రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి గోదావరిఖని డిపో నుండి మొత్తం 115 ప్రత్యేక బస్సులను కేటాయించామని ప్రకటనలో వివరాలను తెలిపారు ఆ డిపో మేనేజర్ ఎం. నాగభూషణం. వీటి నిర్వహణ కోసం 230 మంది అనుభవజ్ఞులైన డ్రైవర్లను, 170 మంది ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా నియమించామని, అలాగే జాతర రోజుల్లో ప్రతిరోజూ 24 గంటల పాటు బస్సులు అందుబాటులో ఉంటాయి అని తెలిపారు. మేడారం జాతర స్పెషల్ బస్సులకు పెద్దలకు రూ. 400, పిల్లలకు రూ. 230 చార్జీలను నిర్ణయించినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ఈ స్పెషల్ బస్సుల్లోనూ వర్తిస్తుంది అని తెలిపారు. మేడారంతో పాటు, జనవరి 27 (మంగళవారం) నుండి గోయిల్ వాడ జాతరకు కూడా ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు దీనికి ఛార్జీలు పెద్దలకు రూ. 60, పిల్లలకు రూ. 40గా నిర్ణయించామని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల జాతర ప్రత్యేక బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్ అనుమతించబడవు అని ప్రయాణీకులు కేవలం నగదు మాత్రమే చెల్లించి టికెట్లు తీసుకోవాలని డీఎమ్ సూచించారు. మరిన్ని వివరాలకు 9441335701 నంబరులో సంప్రదించాలని కోరారు.

# లారీ ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన గొర్రెల కాపరికి న్యాయం చేయండి

*రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ డిమాండ్*



**మంచిర్యాల , జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ మరియు రాష్ట్ర కార్యదర్శి చెగొండ రాజన్న యాదవ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్ నర్లపూర్ గ్రామానికి చెందిన ఆర్కటి మొండి తండ్రి రాజెల్లు ను పరామర్శించారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ లారీ ప్రమాదంలో మరణించిన గొర్రెలు 18 అక్కడికక్కడే మరణించడం, 8 గొర్రెలకు కాలు నడుము విరిగి అనారోగ్యానికి గురయ్యాయన్నారు. దాదాపు 2 లక్షల 50 వేలు రూపాయలు నష్టం జరిగిందని ఆర్కెటి మొండి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని మందమరి ఎస్సైని కోరడం జరిగిందన్నారు. గొర్రెల మందను నార్లపూర్ హైవే రోడ్డు నుండి దాటిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. డ్రైవర్ కం ఓనర్ ఆకుల శంకరయ్య లారీ నెంబర్ ౦౦ 22 ౦6939 గల లారీ తప్ప తాగి మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ 18 గొర్రెలు మరణించడం 8 గొర్రెలు కాళ్ళ నడుములు వీరిగి పోవడానికి రైతు కుటుంబానికి తీరని నష్టం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామవాసులు చిట్టవేణి మల్లయ్య యాదవ్, అరకటిసాధి యాదవ్, యూత్ నాయకులు సాగర్ యాదవ్, చిట్టవేన కొమురన్న యాదవ్, కేశవైన సత్యనారాయణ యాదవ్, సంధని వేణి మల్లేష్ యాదవ్ లు పాల్గొన్నారు.

## పంచాయితీల అభివృద్ధిలో సర్పంచ్ లదే ప్రధాన భూమిక

**ఆసిఫాబాద్ జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పంచాయితీల అభివృద్ధిలో సర్పంచ్ లదే ప్రధాన భూమిక అని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల మైనారిటీ సంక్షేమ పాఠశాలలో పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో కాగజ్ నగర్ డివిజన్ లోని కాగజ్ నగర్, దహేగాం, బెజ్జూర్, చింతల మానేపల్లి, కౌటాల మండలాలకు చెందిన సర్పంచ్ లకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఎడిటోరియల్

## రాజ్యసభ రూట్ లో విజయసాయిరెడ్డి ?

వైసీపీ మాజీ నేత మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభ రూట్ లో ఉన్నారా అన్న చర్చ సాగుతోంది. ఆయన 2025 జనవరి 25న తన ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఆ తరువాత ఆయన వైసీపీకి కూడా రాజీనామా చేసారు. ఈ విధంగా సంచలన నిర్ణయం తీసుకుని మూడున్నరేళ్ళ తన పదవీ కాలాన్ని ఆయన వదిలేసుకున్నారు. ఇక విజయసాయిరెడ్డి విడిచిపెట్టిన ఎంపీ సీటు బీజేపీ పరం అయింది. లేటెస్ట్ గా చూస్తే విజయసాయిరెడ్డి బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. తాను రాజకీయాలలో కొనసాగుతాను అన్నారు.దేశవ్యాప్తంగా 72 దాకా రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. అవన్నీ ఈ ఏడాది జూన్ లోగానే భర్తీ చేస్తారు. ఈ మొత్తం ఖాళీలలో అత్యధిక సీట్లు తిరిగి రాబట్టుకునేది కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీనే అని అంటున్నారు. ఈ మధ్యనే బీహార్ లో బీజేపీ దాని మిత్ర పక్షం జేడీయూ గెలిచాయి. యూపీలో కూడా బీజేపీ అధికారంలో ఉంది. అలాగే అనేక ఇతర రాష్ట్రాలలో రాజ్యసభ ఖాళీలు అవుతున్నాయి. వీటిని ఎక్కువగా బీజేపీ గెలుచుకుంటుంది. దాంతో విజయసాయిరెడ్డి చూపు బీజేపీ మీద ఉంది అని అంటున్నారు. ఇక విజయసాయిరెడ్డి ఈ రోజుదాకా బీజేపీని ఎక్కడా విమర్శించినది లేదు, పైగా మోడీ పాలనకు ఆయన కితాబు ఇస్తున్నారు. అంతే కాదు ఆయన రాజ్యసభ సీటుకు రాజీనామా చేస్తున్నప్పుడు కూడా బీజేపీ కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఇవన్నీ చూసిన వారు ఆయనకు బీజేపీతో మంచి రిలేషన్స్ ఉన్నాయని భావించారు. ఆయన వెంటనే బీజేపీలో చేరుతారు అని అనుకున్నా ఏడాది పాటు విరామం తీసుకోవడం అంటే వ్యూహాత్మకంగానే అని అంటున్నారు. ఇపుడు తగిన సమయం వచ్చింది అని అందుకే తాను రీ ఎంట్రీ ఇస్తున్నట్లుగా విజయసాయిరెడ్డి తాజాగా ప్రకటించారు అని అంటున్నారు. విజయసాయిరెడ్డి రాజకీయంగా మంచి అనుభవం కలిగిన వారు, వ్యూహకర్తగా పేరు గడించారు. వైసీపీకి బ్యాక్ బోన్ గా ఉన్నారు. ఆయనను కనుక చేర్చుకుంటే గ్రేటర్ రాయలసీమ పరిధిలో పార్టీ బలాన్ని విస్తరించుకోవచ్చు అన్న ఆలోచనలు కమలదళానికి ఉన్నాయని చెబుతున్నారు. అంతే కాదు ఆయనకు ఎంతో మంది వైసీపీ నేతలతో పరిచయాలు బాగా ఉన్నందువల్ల ఆ పార్టీ నుంచి కూడా బీజేపీలోకి వలసలు వచ్చే అవకాశాలు ఉంటాయని కూడా అంటున్నారు. ఇక విజయసాయిరెడ్డి రాజ్యసభ ఎంపీగా సబ్జెక్ట్ మీద బాగానే మాట్లాడుతారు అని పేరు ఉంది. దాంతో ఆయన సేవలను పెద్దల సభలో కూడా సమర్ధంగా వినియోగించుకోవచ్చు అన్నది కూడా కమలనాథులలో ఉంది అని అంటున్నారు. ఇక విజయసాయిరెడ్డికి కాషాయం పార్టీ మంచి ఆప్షన్ గా ఉంది. ఆయన వైసీపీని విమర్శించి అందులో తిరిగి చేరలేరు, అంతే కాదు, టీడీపీలో చేరేది ఉండదు, దాంతో ఆయనకు ఏకైక ఆప్షన్ గా బీజేపీ ఉంది అని చెబుతున్నారు. దాంతో పాటు ఆయనకు కేంద్ర బీజేపీ పెద్దల వద్ద ఉన్న మంచి పరిచయాలు కూడా బీజేపీలో చేరేందుకు ఉపకరిస్తాయని అంటున్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి కనుక బీజేపీలో చేరితే ఎంపీ సీటు ఆయనకు లభిస్తుందా అంటే ప్రచారంలో అదే ఉంది. ఈ రెండు జరిగితే కనుక ఏపీ రాజకీయాల్లో సమూలమైన మార్పులు వస్తాయని అంటున్నారు. అటు అధికార కూటమి ఇటు వైసీపీకి కూడా విజయసాయిరెడ్డి రీ ఎంట్రీ అన్నది ఒక కుదుపుగా ఉండొచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఈ తరహా ప్రచారంలో నిజమెంత ఉందో. ఏమి జరుగుతుందో.

## హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకుందాం - జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు అత్యంత ముఖ్యం అని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వాహనదారులకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలో మూడు స్తంభాల సెంటర్ కు సమీపంలోని జాతీయ రహదారులు 65, 216 కూడలి వద్ద మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని, హెల్మెట్ తలకు రక్షణ కవచమని, ఇది ప్రమాద సమయంలో తలకు, మెదడుకు తీవ్రమైన గాయాలు కాకుండా కాపాడుతుందన్నారు. హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ తోలవద్దని హితవు పలికారు. కలెక్టర్ తో పాటు ట్రాఫిక్ సిఐ నున్న రాజు, ఎస్సై ఏ రామశాస్త్రులు, తదితర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నాగేశ్వరావు కుటుంబానికి ఎమ్మెల్యే వసంత ఆర్థిక సహాయం



**ఇబ్రహీంపట్నం, జనవరి 24(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ నాయకులు పాలపర్తి నాగేశ్వరావు కుమార్తె ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించింది. స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ నాగేశ్వరావు కుటుంబానికి అండగా నిలిచారు.లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. శనివారం నాడు కొండపల్లి టిడిపి కార్యాలయంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు చేతుల మీదుగా వారికి అందించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కష్టం వచ్చినప్పుడు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యేకి నాగేశ్వరావు మరియు టిడిపి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్లు చనుమోలు నారాయణరావు, ధరనికోట విజయలక్ష్మి, టిడిపి నాయకులు క కరిమికొండ బాలాజీ, రావి ఫణి,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎండి అప్సర్, దాసు, అజయ్ , కొత్తపల్లి ప్రకాష్, విజయ తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో ఎల్వోసీ పత్రాలు అందచేత...





**విజయవాడ పశ్చిమ జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురం ప్రాంతానికి చెందిన మహ్మద్ షానవాజ్ అనే మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతోంది. ఆమె వైద్యులను సంప్రదించగా సర్జరీ చేయాలని సూచించారు. ఆర్థికంగా సర్జరీ చేయించుకుని స్తోమత లేకపోవడంతో ఆమె కూటమి నాయకుల సాయంతో ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ను సంప్రదించింది. ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కు అవసరం అయిన వైద్య సాయం కోసం ఎమ్మెల్యే సుజనా చౌదరి సీయం సహాయనిధి నుంచి 1,82,100 రూపాయలు రికమండ్ చేస్తూ లేఖను రాశారు. దానికి సంబందించిన ఎల్వోసీ పత్రాన్ని భవానీపురం ఎమ్మెల్యే కార్యాలయంలో 49 వడివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ల చేతుల మీదుగా బాధితురాలి కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే సుజనా చౌదరి కి క్రుతజ్నతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బేసి కంతేశ్వరుడు ,. సుజనా మిత్రలు పాల్గొన్నారు.

**మోకాలి శస్త్ర చికిత్స కోసం లేఖ...** వించిపేట కు చెందిన మల్లిచర్ల సామ్రాజ్యం మోకాలు నొప్పితో బాధపడుతోంది. స్థానిక వైద్యులను సంప్రదించగా ఎడమ మోకాలిని రీప్లేస్ చేయాలని సూచించారు. సర్జరీ ద్వారా మోకాలి శస్త్ర చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక పోవడంతో ఎమ్మల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ను సంప్రదించారు. ఆయన ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలోని బర్డ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ను సంప్రదించి సామ్రాజ్యం కు మోకాలి మార్పిడి విషయం వివరించారు. ఈ మేరకు ఆయన ఒక లేఖను కూడా ఆసుపత్రి కి లేఖను రాశారు. లేఖను కార్పొరేటర్ బుల్లా విజకయ్ కుమార్, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ల చేతుల మీదుగా ఆమె కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు , సుజనా మిత్ర లు పాల్గొన్నారు.

# గంజాయి పై ఉక్కు పాదం

**171.2 కిలోల గంజాయి పట్టుకున్న కృష్ణాజిల్లా పోలీసులు.**



**మచిలీపట్నం జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్న గంజాయి కి సంబంధించి శనివారం జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీస్ పెరేడ్ మైదానం నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వివరించారు. హనుమాన్ జంక్షన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్, ఆత్కూరు ఎస్ఐకి రాబడిన సమాచారం మేరకు శుక్రవారం సుమారు రాత్రి 09.00 గంటలకు చిన్నవుటపల్లి, మధుఖాన్ కటింగ్ దగ్గరలో వాహనాలు తనిఖీ చేస్తూ ఉండగా ఇద్దరు వ్యక్తులు ఘ్రా39ఖ్రా 4715 ఐచర్ వ్యాన్ ను చిన్నవుటపల్లి, మధుఖాన్ కటింగ్ సమీపానికి వచ్చే సమయంలో పోలీస్ వారిని చూసి వ్యాన్ ను మధుఖాన్ ఇండస్ట్రీస్ రోడ్ వైపుకి త్రిప్పుకుని పారిపోతూ ఉండడాన్ని వివాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ సిబ్బంది గమనించారు. ఎస్ ఐ తన సిబ్బంది సహాయంతో ఇద్దరినీ పిన్నమనేని హాస్పిటల్ వెనుక వైపు, ఆదిత్య వెంచర్స్, గంగనమ్మ గుడి దగ్గరలో పట్టుకొని తనిఖీ చేసి వారివద్ద నుండి సుమారు 171.2 ఖస్త్రం గంజాయిని, రెండు సెల్ ఫోన్ లు, ఐచర్ వ్యాన్ ను స్వాధీనం చేసుకున్నారు అని ఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వంటివి యువత జీవితాలను నిర్వీర్యం చేయడమే కాక వారికి అందవలసిన బంగారు భవిష్యత్తును అందకుండా చేస్తుంది. కావున ఎవరికైన గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు వంటి వాటికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీస్ వారికి, ఈగల్ టీంకు సమాచారం అందిస్తే అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. గంజాయిను తరలించే వారిని చాకచక్యంగా పట్టుకున్న గన్నవరం డిఎస్పి ని, హనుమాన్ జంక్షన్ ఇన్స్పెక్టర్ ని, ఆత్కూరు ఎస్సై, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి నాయుడు, అడిషనల్ ఎస్పి ఏ ఆర్ బి.సత్యనారాయణ, గన్నవరం డిఎస్పి సిహెచ్ శ్రీనివాసరావు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఐదేళ్లుగా అపరిష్కృతంగానే సమస్య.. అధికారులకు ఆనవాళ్లు చూపిన స్థానికులు

**స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు.. త్వరలోనే పరిష్కరిస్తామని హామీ**





**సూరారం, జనవరి 23, (వార్తాప్రభ)** : సూరారం మెయిన్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ సామాజిక, పర్యవరణ ప్రేమికుడు కొల రవీందర్ ముదిరాజ్ఆధ్వర్యంలో స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఏఈ వీరేశం, డీఈ శ్రీనివాస్ మరియు స్థానిక కార్పొరేటర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు.

**ప్రమాదాలకు నిలయంగా ప్రధాన రహదారి** ఈ సందర్భంగా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఈ ప్రధాన రహదారి గుండా నిత్యం వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, ఈ క్రమంలో రోడ్డుపైనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఒక లారీ ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన విషయాన్ని గుర్తుచేస్తూ, దానికి సంబంధించిన ఆనవాళ్లను అధికారులకు ప్రత్యక్షంగా చూపించారు.

**ఐదేళ్ల పోరాటం..**గత ఐదు సంవత్సరాలుగా ఈ సమస్యపై cప్రజావాణిcలో కూడా అనేక వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఏఈ మరియు డీఈలు.. ట్రాన్స్‌ఫార్మర్‌ను పైకి లేదా పక్కకు మార్చే విధంగా త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కృష్ణారెడ్డి, రాజు, హుస్సేన్, రామ్మోహన్ మరియు ఇతర కాలనీవాసులు పాల్గొన్నారు.

# రాజకీయ ఉనికి కోసమే ముఖ్యమంత్రిపై జోగి అనుచిత వ్యాఖ్యలు

**జైలుకెళ్లిన జోగి రమేష్ కు బుద్ధి రాలేదు**
**టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు**



**ఇబ్రహీంపట్నం, జనవరి 24(వార్తా ప్రభ ప్రతినిధి):**నకిలీ మద్యం కేసులో జైలుకు వెళ్లి వచ్చిన జోగి రమేష్ బుద్ధి మార్చుకోలేదని, కనీసం వయసులో పెద్దాయన అని గౌరవం లేకుండా చంద్రబాబును ఏక వచనంతో సంబోధించడం జోగి నీచ సంస్క ృతికి నిదర్శనం అని మండిపడ్డారు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ మరియు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు. కొండపల్లి టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో మీ పాత్ర పూర్తి సాధారాలతో సీట్ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచారు. కోర్టు నీకు రిమాండ్ విధించింది. ఇదంతా చట్ట ప్రకారం జరిగిన మాట వాస్తవం కాదా అన్నారు. ఇందులో లావాదేవీలు నువ్వు నీ భాగస్వామి అద్దేపల్లి జనార్ధన్ వెళ్లి ప్రమాణాలు చేసి వాటాలు చూసుకోండి అంతేకానీ ఏ సంబంధం లేని చంద్రబాబు, లోకేష్ పేర్లని తీసుకొచ్చి మీ రాజకీయ ఉనికి కోసం ప్రగల్భాలు పలికితే టిడిపి కార్యకర్తలు చూస్తూ ఊరుకోరన్నారు.గత వైఎస్ఆర్సిపి పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టి సంక్షేమం అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారు. విద్యారంగంలో నూతన మార్పులు తీసుకొచ్చి మంత్రి నారా లోకేష్ తన వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. మరోసారి ముఖ్యమంత్రిపై, నారా లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్లు చనుమోలు నారాయణరావు, ధరనికోట విజయలక్ష్మి, టిడిపి నాయకులు క కరిమికొండ బాలాజీ, రావి ఫణి,జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి అప్సర్, దాసు, అజయ్ , కొత్తపల్లి ప్రకాష్, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి? పుస్తకాల పంపిణీ



**ఇబ్రహీంపట్నం, జనవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రతి ఆడపిల్ల ఎదుగు తున్న వయసుతోపాటు శారీరకంగా, మానసికంగా వచ్చే మార్పులను తెలుసుకోవాలని క్రాంతి హై స్కూల్ ప్రధానోపా ధ్యాయిని వి.అమ్మాజీ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక, లైన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్కే నగర మహిళ వారి ఆధ్వర్యంలో కొండపల్లి క్రాంతి హై స్కూల్ లో 7, 8, 9, 10 తరగతిల విద్యార్థినులకు ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత

**చేజర్ల యుటిఎఫ్ శాఖను అభినందించి 15000 రూపాయలు అందించిన తహశీల్దారు మస్తానయ్య**





**చేజర్ల జనవరి 24 (వార్తాప్రభ)** చేజర్ల లోని యూటీఎఫ్ కార్యాలయంలో ముగ్గురు పేద విద్యార్థులకు యూటీఎఫ్ చేజర్ల మండల శాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 25 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరిగింది.గత 6 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు విద్యా పరమైన ఖర్చుల కొరకు మండలంలోని ఉపాధ్యాయులు మరియు దాతల ద్వారా సేకరించిన మొత్తాన్ని నిరుపేద విద్యార్థులకు అందించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్న యుటిఎఫ్ చేజర్ల మండల శాఖను చేజర్ల మండల తహశీల్దారు ఆర్ మస్తానయ్య అభినందించడమే కాకుండా తన వంతుగా పది హేను వేల రూపాయలను ప్రకటించి వెంటనే అందజేశారు.తహశీల్దారు మాట్లాడుతూ భవిష్యత్తులో పేద విద్యార్థులకు అవసరమైన ఎటువంటి సహాయం కోసమైనా తనను సంప్రదించాలని ఆయన కోరారు.అలాగే నిరుపేద విద్యార్థులకు అందిస్తున్న సహాయ సహకారాల ను గూర్చి మండల విద్యాశాఖాధికారులు ఇందిర మరియు మస్తానయ్య పరిపాలనా అధికారి విజయ లలిత డిప్యూటీ తహశీల్దారు మల్లికార్జున ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యుటిఎఫ్ యూనియన్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు మండల నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కెయూ ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు.




**మచిలీపట్నం జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ భారతదేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి దాన్ని నిలబెట్టుకోవడానికి ఓటరుగా మన వంతు నిర్వర్తించాల్సిన కర్తవ్యం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె రాంజీ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటు కున్న విసిష్టత, ప్రాముఖ్యత గురించి చెప్పారు... తదుపరి వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎం.వి బసవేశ్వర రావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండినా ఇంకా ఓటు నమోదు చేసుకోని విద్యార్థులు ఎవరైనా ఉంటే గనుక యుద్ధ ప్రాతిపదికన ఆ కార్యక్రమాన్ని పూర్తిచేసుకోవాలని, ఓటు యొక్క విలువ తెలుసుకొని ముందుకు సాగాలని విద్యార్థులను ఉద్దేశించి చెప్పుకొచ్చారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా. ఆర్ విజయ్ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు దుర్గాప్రసాద్ రాజులపాటి, రంగ శ్రీ, డా. రవి, డా సల్మా డా. శేషారెడ్డి , బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు ఆసరా ముఖ్యమంత్రి సహాయ నిధిలబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు రూ.3,60,422 చెక్కు అందజేత

**చెక్కు అందజేసిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**



**విజయవాడ పశ్చిమ జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలోని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరాగా నిలుస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం తన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.రూ.3,60,422 చెక్కు ను లబ్ధిదారుడు మండవ వెంకట సూర్య ప్రతాప్ తండ్రి ఎమ్.రాజేశ్వరరావు కి అందజేశారు. 19వ డివిజన్ లబ్బీపేటకి చెందిన మండవ వెంకట సూర్య ప్రతాప్ కి ఇటీవల కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స జరిగింది. సీఎంఆర్ ఎఫ్ ద్వారా సాయం అందించినందుకు ఎంపి కేశినేని శివనాథ్ కి మండవ వెంకట సూర్య ప్రతాప్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రతి నెల లక్షల రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. వైద్య సేవలు చేయించుకున్న వారు ఆరునెలల లోపు సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చేసే ప్రతి కార్యక్రమం ప్రజలకు ఉపయోపడేదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆ తొమ్మిది గ్రామాల విలీనమే లక్ష్యం : ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్





**గన్నవరం, జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ రూరల్ మండలం పి. నైనవరం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సాధారణంగా ప్రతి నెల మూడవ శనివారం జరిగే ఈ కార్యక్రమాన్ని, ఈసారి పండుగ సెలవుల కారణంగా నాలుగవ వారంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలని, బహిరంగ మలమూత్ర విసర్జనను పూర్తిగా అరికట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం యార్లగడ్డ మీడియాతో మాట్లాడుతూ నైనవరం పాఠశాలలో పారిశుధ్యం సరిగ్గా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.తన నియోజకవర్గం రెండు జిల్లాల్లో ఉండటం వల్ల ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా నున్న రోడ్డు సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. గత పాలకులు చేసిన తప్పులను తాను పునరావృతం చేయనని, ఈ గ్రామం సహా చుట్టుపక్కల ఉన్న తొమ్మిది గ్రామాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ గ్రామం మున్సిపాలిటీలో కలిస్తేనే తాగునీటి సమస్య, చెత్త సమస్య తీరతాయని, రోడ్లు కూడా అభివృద్ధి చెందుతాయని వివరించారు. ఈ ప్రాంతంలో తాగునీటిలో టి.డి.ఎస్.స్థాయి 3000 వరకు ఉండటం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, నైనవరంలో 10 ఎకరాల విస్తీర్ణంలో కృష్ణా యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు యార్లగడ్డ వెల్లడించారు. గ్రామంలోని రైస్ మిల్ బాయిలర్ వల్ల కలుగుతున్న కాలుష్యంపై ఇప్పటికే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో మాట్లాడానని, అనుమతి లేని పక్షంలో దానిని వెంటనే నిలిపివేయిస్తామని హామీ ఇచ్చారు. పేదలకు ఇళ్ల స్థలాల సమస్య త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల ఎంపీడీఓ విగ్గిన్స్, మండల టిడిపి అధ్యక్షులు గొడ్డళ్ల చిన్న రామారావు, పి. నైనవరం గ్రామ టిడిపి అధ్యక్షులు బెజవాడ రామకృష్ణ, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ సాతులూరి కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ భట్టా చిన్నబ్బాయి, అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య, నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షులు చల్లగాలి సునీల్, గ్రామ టిడిపి ప్రధాన కార్యదర్శి చప్పిడి రమేష్, యూనిట్ ఇంచార్జి షేక్ నబి, కొల్లా ఆనంద్, ధూళిపాళ్ల దేవేందర్, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు అన్నంశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## వీధి వ్యాపారుల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

**మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు**



**ఇబ్రహీంపట్నం, జనవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** వీధి వ్యాపారుల ఆర్థిక స్వావలంబనే పీఎం స్వానిధి 2.0 పథకం లక్ష్యమని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. కొండపల్లి మెప్మా అధ్వర్యంలో పురపాలక సంఘం కార్యాలయంలో పీఎం స్వానిధి 2.0 క్రెడిట్ కార్డు అప్లయ్ చేసే కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ వీధి విక్రయదారుల కోసం పీఎం స్వానిధి లోక కళ్యాణ్ మేళా 2025 సెప్టెంబర్ నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పీఎం స్వానిధి 2.0 కింద మొదటి విడత 278 సభ్యులు రూ.4.17 కోట్ల రుణాలు పొంది అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించారన్నారు. మరి కొంతమంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.మురళీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ లక్ష జనాభా కలిగిన పట్టణంలో వార్డులు, వీధుల వారీగా సర్వే చేయించి అర్హత కలిగిన వీధి విక్రయదారులను గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని ఆర్పీలను ఆదేశించారు. ప్రతి వీధి విక్రయదారుడు ఆర్థిక అభివృద్ధి సాధించే విధంగా డిజిటల్ ట్రాన్సక్షన్ పై శిక్షణ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసి ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రత్యేకంగా దివ్యాంగులైన లబ్దిదారులకు టీఎల్ఎఫ్ ద్వారా సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట రత్నం, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, కౌన్సిలర్ చుట్టుకుదురు వాసు, టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ చుట్టుకుదురు వెంకటేశ్వరమ్మ, మెప్మా సీఎంఎం పి.వి.శ్రీధరరావు, సీవోలు పి.వి.నరసమ్మ, కె.వెంకయ్య, కె.రాహుల్ నంద, పి.శివకేశవ, సమాఖ్య పధాధికారులు, ఆర్పీలు, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

## జ్యోతి, నగర సంకీర్తన



**పెనుగంచిప్రోలు, జనవరి 24( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దీక్ష స్వాములు శనివారం గ్రామ పురవీధులలో జ్యోతి(నగర సంకీర్తన) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు,ముందుగా గ్రామంలోని శివాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఎంతో అందంగా వివిధ రకాల పూలతో అలంకరించిన రధముపై శ్రీ గోపయ్య స్వామి సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ప్రతిమలను ఉంచి గ్రామ పురవీధులలో జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు,అనంతరం దీక్ష స్వాములకు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు తొట్టెంపూడి మురళి అన్న ప్రసాద వితరణ చేశారు,ఈ కార్యక్రమంలో దీక్ష గురు స్వాములు కాశన శ్రీనివాసరావు స్వామి,బంటు. శ్రీనివాసరావు స్వామి, ఆళ్ల మోహనరావు స్వామి, చెరుకూరి నాగేశ్వరావు స్వామి మరియు దీక్ష స్వాములు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు.



**పెనుగంచిప్రోలు, జనవరి ( వార్త ప్రభ)** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్టు పెనుగంచిప్రోలులో స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల పాఠశాల నందు శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సీడీపీఓ సత్య వాణి ఆదేశాల మేరకు సూపర్ వైజర్ రజని ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలతో బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నక్కా బాబురావు మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజంలో ఒక దురాచారమని, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. పిల్లలతో ర్యాలీ చేయించి ,పిల్లలతో అన్ని రకాల పండ్ల మొక్కలు జామ,బొప్పాయి,దానిమ్మ, అరటి నిమ్మ,కరివేపాకు,మామిడి,మునగ చెట్లు నాటించటం జరిగింది. ఈకార్యక్రమంలో ముక్కా సత్యనారాయణ మాస్టారు, వేగినేటి వెంకటరమణ, స్వర్ణలత, త్రివేణి , లగడపాటి శ్రీదేవి మరియు సూపర్ వైజర్ రజిని అంగన్వాడీ వర్కర్స్ నాగమణి, సువర్చల, రాజ్యలక్ష్మి, సునీత, దామాల వాణి ,మంజుల, విజయలక్ష్మి, సూర్యకుమారి, భవాని మరియు పిల్లలు పాల్గొన్నారు..

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

**- కేశినేని శివనాద్ (చిన్ని) పార్లమెంట్ సభ్యులు**

**-పార్కుల ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందిస్తున్నాం - గద్దె రామ్మోహన్, శాసనసభ్యులు**





**విజయవాడ పశ్చిమ జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ వారు ఓపెన్ జిమ్ములను ఏర్పాటు చేసి ప్రజలకు అందిస్తున్నారని కేశినేని శివనాద్ చిన్ని అన్నారు. శనివారం ఉదయం ఎలక్ట్రిసిటీ కాలనీ, పటమట లో ఎలక్ట్రిసిటీ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాద్ చిన్ని మరియు తూర్పు నియోజకవర్గం గద్దె రామ్మోహన్ పాల్గొని ఎలక్ట్రిసిటీ పార్కును ప్రారంభించారు.ఈ సందర్భంగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు విజయవాడ నగరపాలక సంస్థ వారు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారని ప్రజలు దీన్ని వినియోగించి ఆరోగ్యంగా ఉండాలని, ప్రతిరోజు తమ కార్యచరణలో భాగంగా ప్రజలు ఓపెన్ జిమ్నీ వినియోగించి ఫిట్ గా ఉండాలని అన్నారు.ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గం శాసనసభలు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు నగరపాలక సంస్థ విస్తృతంగా పార్కుల ఏర్పాటు చేపడుతుందని అందులో భాగంగా ఎలక్ట్రిసిటీ కాలనీలో ఓపెన్ జిమ్ పార్క్ ను ఇవాళ ప్రారంభించినందుకు తమకే ఎంతో ఆనందంగా ఉందని ప్రజలందరూ దీన్ని వినియోగించుకోవాలని ప్రతి ఒక్కరు ఆనందంగా ఆరోగ్యంగా ఉంటేనే అది నిజమైన అభివృద్ధి అని అన్నారు.ఈ సందర్భంగా విజయవాడ నగర పాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గిస్తూ, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ 16.72 లక్షల వ్యయంతో ఎలక్ట్రిసిటీ కాలనీలో ఎలక్ట్రిసిటీ పార్కును నిర్మించారని తెలిపారు. కావున ప్రజలందరూ దీన్ని సద్వినియోగం చేసుకొని ఆనందంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో 13 వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మినేని వెంకట ప్రసాద్, శాలివాహన కుమ్మరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరెపి ఈశ్వర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ నగరంగా విజయవాడ ఎప్పుడు ముందు ఉండాలి

***- కేశినేని శివనాథ్ (చిన్ని), పార్లమెంట్ సభ్యులు***

***ప్రతి ఒక్కరు వ్యర్థాల నుండి సంపద సృష్టించాలి - గద్దె రామ్మోహన్, శాసనసభ్యులు***





**విజయవాడ పశ్చిమ జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్వచ్ఛ నగరంగా విజయవాడ ఎప్పుడు ముందు ఉండాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. శనివారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిసిటీ కాలనీ, పటమట లో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ ను ఎల్లప్పుడు స్వచ్ఛ నగరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు ప్రతి నెల స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం వలన ప్రజలలో స్వచ్ఛతపై అవగాహన కలగటమే కాకుండా వారి దినచర్యలో ఒక భాగమైపోయిందని అన్నారు. విజయవాడ నగరాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు సహకరిస్తుందని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై బాధ్యతగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఇంటి వద్దనే వ్యర్థాలను విభజించి, పారిశుధ్య కార్మికులకు అందించాలని, ఇంటింటి వ్యర్థాల సేకరణ జరిగేటప్పుడు ఇటువంటి వ్యర్థాలు ఇచ్చినచో వ్యర్థాల నుండి సంపద సృష్టించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల జీరో గ్యాప్ శానిటేషన్ అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోటు లేకుండా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్నామని అన్నారు. తదుపరి స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్స్ ను సందర్శించారు. అందులో భాగంగా పర్యావరణహితమైన వస్తువులను వాడాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం దానికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన గుడ్డ సంచులను వాడాలనే అవగాహన కల్పించే స్టాల్స్ ను సందర్శించారు. తదుపరి స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జోనల్ కమిషనర్ కె. షమ్మీ అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ స్వచ్ఛత ర్యాలీ ను జెండా ఊపి ప్రారంభించారు. నగరపాలక సంస్థ సిబ్బంది, స్వచ్ఛంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ, ర్యాలీలో పాల్గొని స్వచ్ఛత నినాదాలు పలుకుతూ పరిసర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో 13 వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మినేని వెంకట ప్రసాద్, శాలివాహన కుమ్మరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరెపి ఈశ్వర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన డైట్ లెక్చరర్



**అనుముసముద్రంపేట జనవరి 24 (వార్తాప్రభ)** ఏ ఎస్ పేట మండలంలోని గుడిపాడు క్లస్టర్ పరిధిలోని పెద్దబ్బీపురం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా వృత్తి విద్య శిక్షణ కేంద్రం నుండి సీనియర్ అధ్యాపకులు డైట్ లెక్చరర్ నటరాజన్ మూర్తి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించడం జరిగినది.విద్యార్థుల అసెస్మెంట్ పుస్తకాలను నోటు పుస్తకాలను పరిశీలించారు అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వెనుకబడిన తరగతుల విద్యార్థులకు సులభతరంలో ఎలా బోధించాలి అనే విషయంపై సలహాలు ఇవ్వడం జరిగినది. పాఠశాల మధ్యాహ్న భోజనం పరిశీలించి వంటదారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం గుడిపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్యారెంటెడ్ ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి నూరు శాతం సాధించుటకు తీసుకోవలసిన విధానాలను వివరించడం జరిగింది.అదేవిధంగా జాదూయి పిటారా ఉపయోగించడము ఫ్లాష్ కార్డ్స్ ఉపయోగించడము ఉపాధ్యాయులు క్లస్టర్ సమావేశాల యందు టీచర్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయడం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 ఓ జ్యోతి ఎంఈఓ2 డి సాయి ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సైకిల్ పై జిల్లా కలెక్టర్.



**మచిలీపట్నం జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గూడూరు గ్రామం పర్యటనలో భాగంగా మచిలీపట్నం నుంచి గూడూరుకు, అదేవిధంగా తిరిగి గూడూరు నుంచి మచిలీపట్నంకు దాదాపు 20 కిలోమీటర్లు సైకిల్ పై ప్రయాణించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. జిల్లా కలెక్టర్ సైకిల్ తొక్కుతూ వెళ్లడాన్ని మార్గం వెంబడి పలువురు ఆసక్తిగా గమనించారు. గతంలో సైతం జిల్లా కలెక్టర్ మచిలీపట్నం నుంచి మంగినపూడి బీచ్ వరకు దాదాపు 25 కిలోమీటర్లు సైకిల్ పై ప్రయాణించి అందరి దృష్టిని ఆకర్షించారు. సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన ఆచరణాత్మకంగా చూపుతూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.

## చిత్రకళ ఈ మ్యాగజైన్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్.



**మచిలీపట్నం జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న ఫిబ్రవరి నెల చిత్రకళ ఈ మ్యాగజైన్ ను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం తమ ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు బిఎస్ వీ రమేష్, డైరెక్టర్ ఉమ్మిటి విద్యాధర్, విశ్రాంత జిల్లా పరిషత్ ఉద్యోగి నాంచారయ్య, పెడన పట్టణ తోటమూల జడ్పీ హైస్కూల్ క్రాఫ్ట్ టీచర్ విజయ శ్రీ పాల్గొన్నారు.

## కెబిఎన్ కళాశాల విద్యార్థులకు ఆల్ రౌండ్ చాంపియన్ షిప్



**విజయవాడ పశ్చిమ జనవరి 24:(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల 'లక్ష్య 2కె 26' పేరుతో నిర్వహించిన అంతర కళాశాలల సాంస్కృతిక పోటీల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చేసి ఆల్ రౌండ్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. శనివారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన పోటీల్లో తమ కళాశాల డ్రమటిక్ అసోసియేషన్ విద్యార్థులు కేస్ స్టడీ (ద్వితీయ బహుమతి), యువ నర్తన గ్రూప్ డ్యాన్స్ (ప్రథమ మరియు ద్వితీయ బహుమతులు), మిస్ట్ లక్ష్య 2కె 26 (ప్రథమ బహుమతి) సాధించారన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ విద్యతో పాటు కో కరికులర్ యాక్టివిటీస్ కి తమ కళాశాలలో అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. డ్రమటిక్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ కె.రామకృష్ణ, సభ్యులు డాక్టర్ పవన్ కుమార్, మణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ శివప్రకాష్ విద్యార్థులను అభినందించారు.

## బాలికలకు స్టడీ మెటీరియల్ అందచేత



**ఇబ్రహీంపట్నం,జనవరి 24(వార్తా ప్రభ ప్రతినిధి):** జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కొండపల్లి బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థునులకు స్టడీ మెటీరియల్ అందజేశారు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి,కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. పదవ తరగతి చదువుతున్న బాలికలకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, పోటీ ప్రపంచంలో విజయం సాధించాలని తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి ఎండి అప్సర్, టిడిపి సీనియర్ నాయకులు కరిమికొండ బాలాజీ, మున్సిపల్ బిజెపి కో–ఆప్షన్ సభ్యురాలు నగీన,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లకీలు మోసే రజకులకు కౌన్సిలింగ్ ఇచ్చిన ఎస్ఐ అర్జున్



**పెనుగంచిప్రోలు, జనవరి 24( వార్త ప్రభ)** శ్రీ తిరుపతమ్మ అమ్మవారు రంగులు మ త్సవాన్ని ముగించుకొని తిరుగు ప్రయాణంలో.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ముందస్తు జాగ్రత్తగా,పల్లకీలు మోసే రజకులకు ఈరోజు తగు సూచనలు జారీ చేసిన పెనుగంచిప్రోలు ఎస్సై అర్జున్,ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగిన ఎడల తగు చర్యలు తీసుకోబడతాయని హెచ్చరికలు దారి చేశారు.

# భాధిత కుటుంబాన్ని భువనగిరి ఎమ్మెల్యే ఆదుకోవాలి

**- పిఓడబ్ల్యూ(విముక్తి) రాష్ట్ర కన్వీనర్ పెర్క సునీత డిమాండ్.- ఐలపు పద్మ అధ్యక్షతన జరిగిన జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం**
**- పాల్గొన్న తుమ్మరాణి(టియుకెవి), సన్వాల సుచరిత (టియుజేఏసి), షేక్ షావలి(ఇఫ్టూ), బండకింది సింగరయ్య గౌడ్(భహుజన సత్త).**

**జవహర్ నగర్, జనవరి 24:(వార్తా ప్రభ)**2026, జనవరి–13 న పెంచికల్ పహాడ్ గ్రామంలో లైంగిక దాడికి గురైన నాలుగేళ్ళ చిన్నారి భాధిత కుటుంబాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంబం అనిల్ కుమార్ రెడ్డి వెంటనే అన్ని విధాల ఆదుకోవాలని జనవరి–24 జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ (విముక్తి)) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పెర్క సునీత డిమాండ్ చేశారు. తన నియోకవర్గంలో ఒక పసిపిల్ల పై జరిగిన అత్యాచారం, తీవ్ర హింస వలన ప్రాణాపాయ స్థితి నుండి భయటపడి 12 రోజులు కావస్తున్నా, కనీసం భువనగిరి స్థానిక ఎమ్మెల్యే ఇలాంటి అమానవీయమైన ఘటనపై స్పందించి, సంభందిత బాధిత కుటుంబాన్ని పరామర్శించక పోవడాన్ని బహుజన సత్త రాష్ట్ర అధ్యక్షుడు బండకింది సింగరయ్య గౌడ్ తీవ్రంగా తప్పు పట్టారు. ఇప్పటికైన అనిల్ కుమార్ రెడ్డి ఒక నియోజకవర్గ ప్రజా ప్రతినిధిగా తన సామాజిక బాధ్యత ను గుర్తించి, తగిన మానసిక ధైర్యాన్ని అందివ్వకపోతే ఇంతకంటే దుర్మార్గం, అమానుషం మరొకటి ఉండదని సునీత మండిపడ్డారు. 2026, జనవరి–24, శనివారం రోజు జవహర్ నగర్ జీహేచ్ఎంసి పరిధిలో గల వికలాంగుల కాలనీలో ఐలపు పద్మ అధ్యక్షతన జాతీయ బాలికా దినోత్సవం అవగాహన కార్యక్రమం జరిగింది. అత్యాచారాలు, లైంగిక హింసల పట్ల సమాజం తీవ్రమైన నేరంగా బావించక పోవడం వలనే బాలికలపై లైంగిక నేరాల దాడులు తీవ్రమయ్యాయని తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక(టియుకెవి) రాష్ట్ర కమిటీ సభ్యురాలు తుమ్మరాణి ఆవేదన చెందారు. ఎన్ని రక్షణ చట్టాలు ఉన్న భద్రతను కల్పించడంలో ప్రభుత్వ అదికారులు, పోలీసులు, తల్లిదండ్రులు పిల్లల సంరక్షణకు ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగులలో సరైన అవగాహన




కల్పించక పోవడంతోపాటు సమాజంలో ఆడపిల్లల పట్ల నెలకొన్న వివక్షత, నిర్లక్ష్యంతో కూడిన చిన్నచూపు భావనను వదులులేక పోవడం వలనే, నేడు వారు అక్రమ రవణాలకు, దాడులకు అభద్రతకు గురౌతున్నారని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ(టియుజేఏసి) రాష్ట్ర కమిటీ సభ్యురాలు సన్వాల సుచరిత పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నేటి ఆధునిక సమాజంలో చిన్నారి నుంచి వృద్దుల వరకు ఎవరికి భద్రత లేకుండా పోయిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) కన్వీనర్ షేక్ షావలి ఆందోళనను వ్యక్తం చేశారు. నిత్యం వార్త పత్రికలు, ఎలక్ట్రానిక్, శోషల్ మీడియాల్లో మానవత్వాన్ని మంటగలిపేలా ఆడబిడ్డలపై జరుగుతున్న అనేక దారుణ సంఘటనలు తీవ్ర మనోవేదనకు గురిచేశాయని అన్నారు. మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాలు లైంగిక హింసకు పరాకాష్టగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం భవిషత్ తరాలకు, పిల్లల సర్వోన్నత అభివృద్ధికి ఉపయోగ పడాలికానీ, అందుకు విరుద్ధంగా లింగ వివక్షత, లైంగిక, గ్రుహహింస పెరగడానికి కారణం అవుతున్నాయని గుర్తుచేశారు. పాలకులు గత 18 సంవత్సరాలుగా జాతీయ బాలికా దినోత్సవం పేరిట ఎన్నో పథకాలు చేపట్టారని, అందులో బేటి బచావో, బేటి పడావో మాటున తిరిగి నాలువేల సంవత్సరాల వెనుకటి బానిస సమాజంలోకి క్ష్మలను, పిల్లలను నెట్టివేసే మనువాద పాలనలో పోషక ఆహార లోపం, రక్తహీనత లాంటి రుగ్మతలతో జీవించే హక్కును కూడ కోల్పుతున్నారని అన్నారు. దేశంలో మతతత్వ, కార్పొరేట్ విధానాలు సామాజిక, ఆర్థిక అసమానతలను పెంచి పోషిస్తున్న క్రమంలో పిల్లల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయిందని అన్నారు. ఆడబిడ్డలు ఆట వస్తువులుగా చూపే సంస్క ృతిలో బాగంగా ఇటీవల ఒంటినిండా బట్టలు కట్టుకోకపోతే, మగాళ్ళు నిగ్రహం కోల్పోయి, అత్యాచారాలు కాక ఏం జరుగుతాయని ప్రవచన కారులు వ్యంగంగా చిత్రీకరించి మాట్లాడడం శోచనీయం అన్నారు. సినీ పరిశ్రమలోని ఇంకొకరు ప్రకృతి సహజ సిద్ధమైన క్ష్మ దేహంలోని అవయవాలను అవమాన పరిచేలా అహంకార పూరితమైన పురుష ఆధిక్యతతో సామాన్లు అని సంబోదించడాన్ని తీవ్రంగా ఎండగట్టారు. అప్పుడే పుట్టిన చిన్నారులపై ఏ బట్టలు కట్టుకుంటే? ఏ సామాన్లు కనబడితే నిగ్రహం కోల్పోయి లైంగిక దాడులకు పాల్పడ్డారో చెప్పగలరా అని నిలదీశారు. ఇప్పటికైన సభ్య సమాజంలో మనిషిని మనిషిగా ఆడపిల్లను గౌరవంగా చూసే వ్యవస్థ నిర్మాణానికి ప్రతి ఒక్కరు తమ సామాజిక బాధ్యతలో బాగంగా పాటుపడాలని షేక్ షావలి ఈ సందర్భంగా సూచించారు. ఈపై కార్యక్రమంలో కాలనీ ప్రసిడెంట్ సత్యనారాయణ చారి, బీసి నేత డి.నర్సన్న, మైసయ్య, యమునా గౌడ్ తదితరులు. పాల్గొన్నారు.

## కూకట్ పల్లి లో అరైవ్ అలైవ్‌పై యువతకు అవగాహన



**కూకట్‌పల్లి, జనవరి 24(వారా్త ప్రభ):**కూకట్‌పల్లిలో నిర్వహించిన “అరైవ్ అలైవ్” అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల మహేష్ గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబాల మహేష్ గౌడ్ పాల్గొని కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సైబరాబాద్ కమిషనర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “అరైవ్ అలైవ్” కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను అలవర్చుకోవాలని యువతను ఆయన కోరారు. ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, అందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని కమిషనర్ రమేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువత, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు...



**గుడ్లవల్లేరు: జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.మేరీ అన్నారు. మండలంలోని కౌతవరం కాశీగూడెం అంగన్వాడి కేంద్రం వద్ద ఐసిడిఎస్ గుడివాడ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ మేరీ మాట్లాడుతూ ఆడపిల్లకు 18 సంవత్సరాలు లోపు వివాహము చేయకూడదని అలాగే మగవానికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు నిర్వహిస్తే చట్టరీత్యా నేరమే కాక శారీరక, మానసిక ఇబ్బందుల బారిన పడతారని తల్లులకు కిషోర్ బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మసీద్ గురువులు షేక్ నయుయ్, అంగన్వాడీ కార్యకర్త టి నాగమణి పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్.టి.ఆర్. జిల్లా ట్రాఫిక్ పోలీసులు

**పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఆదేశాల మేరకు**






**విజయవాడ పశ్చిమ జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ట్రాఫిక్ డి.సి.పి. శ్రీమతి షిరిన్ బేగం నున్న వికాస్ కళాశాల్లో శనివారం 1000 మంది విద్యార్థినీ విద్యార్థులకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం జరిగింది. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన ధ్యేయంగా, ఆధునిక ట్రాఫిక్ నియంత్రణ సాంకేతికతలను వినియోగిస్తూ, రద్దీ లేని సజావు ట్రాఫిక్ నిర్వహణతో పాటు ప్రజలకు నిరంతర అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన ఎందుకు అవసరం, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రధాన కారణాలు, ప్రమాదాల బారిన పడినప్పుడు కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులు, అలాగే విద్యార్థులుగా సమాజంలో మీ బాధ్యతాయుత పాత్ర ఏమిటి అనే అంశాలను గణాంకాలు (డేటా) సహా సవివరంగా వివరించారు. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ ప్రయాణంలో సీట్ బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా రోడ్డు భద్రత సందేశాలను చేరవేసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు, వికాస్ కాలేజ్ సెక్రటరీ సత్యనారాయణ, కళాశాల విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**.కూకట్ పల్లి, జనవరి24(వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి సీఐ కె.వి. సుబ్బారావు, ట్రాఫిక్ సీఐ తిమ్మప్ప ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మున్సిపల్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై క్లుప్తంగా వివరించారు. కాలం విలువైనది, ప్రాణం అత్యంత విలువైనది అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, రాంగ్ రూట్‌లో వెళ్లకుండా, అధిక వేగాన్ని నియంత్రించి నెమ్మదిగా ప్రయాణించి ప్రాణాలను కాపాడుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సీఐ సుబ్బారావు, ఎస్సైలు రామకృష్ణ, చంద్రశేఖర్, దీక్షిత్, రామకృష్ణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి, శ్రీధర్ రావు, సూర్యనారాయణ, జి. ప్రసాద్, రమేష్, కె.వి.రావు, సాయి, సతీష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## పివిపి మాల్ రోడ్ విస్తరణ లో మీ అభిప్రాయాలు తెలపండి



**విజయవాడ పశ్చిమ జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పీవీపీ మాల్ రోడ్ విస్తరణలో తమ అభిప్రాయాలు తెలుపమని విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, రోడ్డు విస్తరణలో ప్రభావం అయ్యే నిర్మాణల యజమానులతో అన్నారు. శనివారం ఉదయం నగరపాలక సంస్థ జోనల్ 3 కార్యాలయం లో వారితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పివిపి మాల్ రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల ఉందని, ప్రస్తుతం ఆ రోడ్డు 50 నుండి 55 అడుగులు ఉందని, మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగులకు అలైన్మెంట్ చేయగా ఆ రోడ్లో ఉన్న 50 నిర్మాణాలు ప్రభావితం అవుతున్నాయని తెలిపారు. కావున భవన యజమానులు తమ అభిప్రాయాలను తెలపాలని అడిగారు. వారు అభిప్రాయాలు తెలుపగా, ఉన్నత అధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

## శిల్పా రామం లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





**శేరిలింగంపల్లి, జనవరి 24 (వార్తాప్రభ):**మాదాపూర్ లోని శిల్పారామం లో చత్తీస్గర్ద్ గాంధీ శిల్ప బజార్ హ్యాండీక్రాఫ్ట్ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం ప్రియాంక మరియు వేముల రాధికా శిష్య బృందం కూచిపూడి నృత్య అలరించింది. ప్రియాంక శిష్య బృందం పుష్పాంజలి, శ్రీ గణపతిని, మూషిక, దేవి నీయతున్నాయం, రామ కోదండ రామ, గంధము పూయరుగా, తులసీదళములతో రామచంద్రయ్య అంశాలను సింధు, శాన్వి, సాక్షి, శ్రీజ, అమేయ, మీను అనన్య మొదలైన వారు ప్రదర్శించారు. వేముల రాధికా శిష్య బృందం విఘ్నేశ్వర కీర్తన. భామాకలాపం, శరణు సిద్ధి, దశావతర తరంగం, మామవతు సరస్వతి, శివ పంచాక్షరీ, శివ తరంగం, రామాయణ శబ్దం కృతిక, అనైనా, సాన్విక, కాత్యాయని, సహస్ర, అద్వికా మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



## పశు ఆరోగ్య శిబిరంలో 47 గేదెలకు చికిత్స



**ఇబ్రహీంపట్నం, జనవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మొత్తం 48 మంది పశు పోషకులు పాల్గొని 47 గేదెలకు చికిత్స చేయించారు. 17 గర్భ నిర్ధారణ పరీక్షలు చేశారు. కృత్రిమ గర్భధారణలు (ఇన్సెమినేషన్లు) – 8ఎస్ఎస్ఎస్ సెమెన్లు చేశారు. 224 పెద్ద గేదెలకు, 43 దూడలు, 890 గొర్రెలు, మేకలకు పేగు పురుగుల నివారణ (డీవార్మింగ్) చేశారు. గొర్రెలకు బొబ్బ వ్యాధి టీకా, కోళ్లకు ఆర్డీ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, అది కూడా చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ సంయుక్త సంచాలకులు డాక్టర్ సుజని, ఇబ్రహీంపట్నం సంయుక్త సంచాలకులు డాక్టర్ తాళ్లూరి శ్రీనివాస రావు, మూలపాడు పశు వైద్యురాలు డాక్టర్ సిహెచ్.శైలుమాధురి, కొండపల్లి పశు వైద్యురాలు డాక్టర్ బి.స్వాతి అయ్యప్ప, గుంటుపల్లి ఎల్ఎస్ఏ కె.పూర్ణిమ, సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మ వారి కళ్యాణపీటలపై కాకాని వారి వంశీయులు, కొల్లా వారివంశీయులు ఎంపిక



**పెనుగంచిప్రోలు, జనవరి 24( వార్త ప్రభ)** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ళ లో భాగంగా ఫిబ్రవరి 1న జరుగు వార్షిక కళ్యాణములో పీటల మీద కూర్చొనుటకు కాకాని వారి తరపున 4 గురు మరియు కొల్లా వారి తరపున ఒకరు ధరఖాస్తులు సమర్పించియున్నారు. శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు చుంచు రమేష్ మరియు ఆలయ సిబ్బంది సమక్షంలో లాటరి తీయగా కాకాని వారి తరపున కాకాని రవి బాబు, త్రివేణి దంపతులు మరియు కొల్లా వారి తరపున కొల్లా హరికృష్ణ భవ్య శ్రీ ఎంపిక కాబడియున్నారు..

## నయనానందకరంగా స్వామివారి రథోత్సవం.



**చల్లపల్లి, జనవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణా జిల్లా మోపిదేవిలో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి రథోత్సవం నయనానందకరంగా కొనసాగుతోంది. సినీ నిర్మాత నారాయణరావు తన సొంత నిధులు రూ కోటికి పైగా వెచ్చించి స్వామి వారికి సమర్పించిన టేకు రథం పై దేవేరులతో కొలువుదీరిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

## మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తులు.







**మోపిదేవి: అవనిగడ్డ: జనవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)** కృష్ణా జిల్లా మోపిదేవిలో కొలువుతీరిన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు చీకటి మానవేంద్రనాధ్ రాయ్, వేనుతురుమల్లి గోపాలకృష్ణారావు , మండవ కిరణ్మయి, వి.శ్రీనివాస్ లకు డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో న్యాయమూర్తులు పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారు శ్రీ స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ పండితులు వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తులకు దాసరి శ్రీరామ వరప్రసాదరావు , అచ్యుత మధుసూదనరావు లు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, స్వామివారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం విశిష్టతలను తెలుసుకొని, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మచిలీపట్నం జిల్లా జడ్జి జి గోపి, ఆరవ అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి, పదవ కోర్టు అదనపు జిల్లా జడ్జి బాబూనాయక్, అవనిగడ్డ సివిల్ జడ్జి – జూనియర్ డివిజన్ వి స్వర్ణలత, అవనిగడ్డ డి.ఎస్.పి తాళ్లూరి విద్య శ్రీ, తహశీల్దార్ హరిహరనాథ్, చల్లపల్లి సిఐ కె ఈశ్వరరావు, ఎస్ఐలు పామర్తి గౌతమ్ కుమార్, వేమన చందన తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు**
**బాచిపల్లి హరితవనం కాలనీలో ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి**
**మారుమోగిన దేశభక్తి నినాదాలు..**
**నివాళులర్పించిన ప్రముఖులు**





**కుత్బుల్లాపూర్/బాచుపల్లి, జనవరి 23, (వార్తాప్రభ)** :బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వీరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను బాచిపల్లిలోని హరితవనం కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**భారత సైన్యానికి మార్గదర్శకులు నేతాజీ** ఈ సందర్భంగా విజయలక్ష్మి సుబ్బారావు మాట్లాడుతూ.. భారతదేశ శౌర్యాన్ని, సైనికుల పరాక్రమాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు నేతాజీ అని కొనియాడారు. భారత సైన్యానికి మార్గదర్శకులుగా నిలిచిన ఆయన జీవితం భావి భారత పౌరులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నేతాజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆమె పిలుపునిచ్చారు.

**దేశభక్తి నినాదాలతో రెత్తిన కాలనీ** అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారు ‘భారత్ మాతాకీ జై’, ‘జోహార్ సుభాష్ చంద్రబోస్’, ‘వందేమాతరం’ అంటూ చేసిన నినాదాలతో కాలనీలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ముంజేటి రామారావు, కొండమ నాయుడు, కొమ్మారెడ్డి శ్రీనివాస్, వెంకటేశం, సుబ్బారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు గంబూసియా చేపల విడుదల

## గుడివాడలో రెండు నూతన పబ్లిక్ టాయిలెట్స్‌కు శంఖుస్థాపన..



**గుడివాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమం లో భాగంగా పట్టణ ప్రజలకు శుభ్రత, సౌకర్యం మరియు గౌరవప్రదమైన శానిటేషన్ సౌకర్యాలను అందించడం కోసం రామబ్రహ్మం పార్క్ వద్ద నూతనంగా ప్రజా మరుగుదొడ్లను నిర్మించుట కొరకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శంకుస్థాపన చేయడం జరిగినది. ఇంకో పబ్లిక్ టాయిలెట్ కూడా త్వరలో మొదలు పెట్టడం జరుగుతుంది. అదేవిధంగా దోమల నియంత్రణ మరియు ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా సుమారుగా దోమ లార్వా తినే 8 లక్షల గాంబూసియా చేపలను గుడివాడ పురపాలక సంఘమునకు తెప్పించి, మొదటగా మున్సిపల్ కమీషనర్ ఎస్. మనోహర్ చేతుల మీదగా 11వ వార్డులోని చెరువులో విడుదల చేయడం జరిగినది. ఈ చర్య దోమల పెరుగుదలను నియంత్రించి, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు తోడ్పడనుంది. గుడివాడ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో నీరు నిల్వ ఉన్న చెరువులు, ఖాళీ స్థలాల యందు మరియు మెయిన్ డ్రైనేజీలలో గాంబూసియా ఫిష్ ను వదలడం జరిగింది. పై కార్యక్రమాలలో మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో కెల్ల అన్నదానం గొప్పది



**గుడివాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** సూరపనేని శేషగిరిరావు 17వ వర్ధంతి సందర్భంగా శనివారం మధ్యాహ్నం కర్ల కోటేశ్వరరావు వృద్ధాశ్రమం నందు మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ, గుడివాడ వారీ అధ్వర్యంలో కుమారుడు సూరపనేని రాజగోపాల్, శ్రీమతి శ్రీలక్ష్మి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఉమ్మడి క్రష్ణాజిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ దండమూడి జయలక్ష్మి మాట్లాడుతూ ఆకలిగొన్న వారి వద్దకే వెళ్ళి ఉచితంగా అన్న వితరణ చేయడం మానవీయతకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ మానవతాశాఖ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కార్యదర్శి నందమూరి పద్మజ, కో చైర్మన్ అన్నపురెడ్డి గోపీరెడ్డి, డైరెక్టర్ పిన్నమనేని రామచంద్రరావు, కార్యవర్గ సభ్యులు సామి రామమోహనరావు, ఉపాధ్యక్షులు ఘంటసాల రామకృష్ణ, సభ్యులు బ్రహ్మయ్య, దానబోయిన సత్యనారాయణ లు పాల్గొన్నారు.

# బోస్ పోరాటం నేటి యువతకు ఆదర్శనీయం



**గుడివాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కాకర్ల వీధిలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద తారకరామ వాకర్స్ క్లబ్ గుడివాడ వారీ అధ్వర్యంలో ఆ మహనీయుని చేసిన సేవలను గుర్తించుకుని పలువురు నాయకులు ప్రసంగించినారు. తెలుగు మహిళ నాయకురాలు యార్లగడ్డ సుధారాణి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శనీయమని అలాగే ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి భారతీయుల్లో పోరాట స్ఫూర్తిని నింపిన యోధుడుని కొనియడారు. ఈ కార్యక్రమంలో హాజరైన వారు మెరుగుమాల బ్రహ్మయ్య, మరడాని వెంకటేశ్వరరావు, యార్లగడ్డ సుధారాణి, పాలకొల్లు సూరిబాబు, అరుణకుమారి చల్ల ఈశ్వరి పి నాంచారి పుట్టి సతీష్ బాబు లెక్చరర్ ప్రసాద్ రాజేశ్వరరావు తదితరులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ కి పూలమాలలతో ఘన నివాళులర్పించారు.

# బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.. డాక్టర్ శివరామకృష్ణ




**చల్లపల్లి/అవనిగడ్డ,జనవరి 24 (వార్తాప్రభ) :** బాలికల సంరక్షణ, వారి హక్కులు, ఆరోగ్యం,విద్య, సామాజిక ఎదుగుదల పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పురిటిగడ్డ పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ శివరామకృష్ణ అన్నారు.శనివారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలి పరిధిలోని పురిటిగడ్డ పిహెచ్ సి వద్ద నుంచి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ, మానవజాతి వికాసానికి మహిళల ఆవశ్యకతను వివరించారు.బాలికలకు సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు.ఈకార్యక్రమంలో సిహెచ్ఓ సుమతి, హెచ్ బారతి , ఫార్మసిస్ట్ శ్రీనివాసరావు,తుడిచేసి విజయకుమార్,ఎఎన్ఎంలు, అసిస్టెంట్ ఎఎన్ఎంలు, పిహెచ్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుల మతాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం సేవలు

- 31 బాధితులకు రూ.20 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాము..





**గుడివాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** కుల మత ప్రాంత వర్గాలు చూడకుండా రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం ప్రజా వేదికలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 31 బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రాము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న బాధితులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే రాము లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో వైద్య చికిత్సలు చేయించుకునీ కష్టాల్లో ఉన్నవారికి సీఎం సహాయం నిధి పేరుతో అందించే సహాయం ఎంతో చేయూతనందిస్తుందన్నారు. గుడివాడ చరిత్రలో రికార్డు స్థాయిలో కూటమి 19 నెలల పాలనలో రూ. 4 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి నగదును బాధితులకు అందించామని ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్డబ్ల్యుసి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ గడ్డ రవికుమార్, జనసేన నాయకులు సందు పవన్, రూరల్ మండల మండల టిడిపి అధ్యక్షులు వాసే మురళి, మజ్జాడ నాగరాజు, టిడిపి నాయకులు పంద్రాజు సాంబయ్య, షేక్ ఇబ్రహీం, అడుసుమిల్లి శ్రీనివాస్, ఆరేపల్లి పాండు, కోల్లారెడ్డి అంజిరెడ్డి, వీరమాచినేని శివప్రసాద్, వల్లభనేని రంగబాబు, దాసరి మల్లి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం



**గుడివాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** క్రీడల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.జె.ఎస్.కుమార్ తెలియజేసారు. కళాశాల అధ్వర్యంలో కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పరుగు పందెం పోటీలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వ్యాయామం చేసినవారు, రోజులో కనీసం 45 నిముషాలపాటు నడచినవారు త్వరగా రోగాల బారిన పడరన్నారు. ఈ పోటీలలో పురుషుల విభాగంలో ఎ.జి.అండ్ ఎస్.జి. సిద్ధార్థ కళాశాల (అటానమస్), ఉయ్యూరు, ప్రథమ స్థానంలో, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల (అటానమస్) ద్వితీయ స్థానంలో, పర్వతనేని బ్రహ్మయ్య ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల (అటానమస్), విజయవాడ తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే మహిళల విభాగంలో ఎ.జి.అండ్ ఎస్.జి. సిద్ధార్థ కళాశాల (అటానమస్), ఉయ్యూరు ప్రథమ స్థానంలో, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల (అటానమస్) ద్వితీయ స్థానంలో, కొండపల్లి తాతిరెడ్డి మహిళా కళాశాల, గుడివాడ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమములో కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ యల్.ఆర్.కె. ప్రసాద్, సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.ఎస్. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి బి.ఎస్.ఎస్. పద్మజ, కృష్ణా విశ్వవిద్యాలయం ఎంపిక కమిటీ సభ్యులు డాక్టర్ బొమ్ములూరి ఉదయ కుమార్, అలాగే డాక్టర్ నవుడు హేమ వెంకటలక్ష్మి మరియు పి.చంద్రబాబు, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి లు విజేతలకు బహుమతులు అందించారు.

# గుడివాడ ఇంజినీరింగ్ కళాశాలలో సాఫ్ట్‌వేర్ కంపెనీలచే ప్రాంగణ ఎంపికలు..

**గుడివాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** శుక్రవారం వీ.కే.ఆర్ అండ్ వీ.యన్.బి ఇంజినీరింగ్ కళాశాలలో బెంగుళూరుకి చెందిన మల్టీనేషనల్ కంపెని "టాటా ఎలక్ట్రానిక్స్" హెచ్.ఆర్ మేనేజర్లు షేక్ మున్వర్, హనుమంతరావు లు బీ.టెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 110 మంది విద్యార్థులు వ్రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, గ్రూప్ డిస్కషన్ మరియు ఇంటర్వ్యూ కి హాజరు కాగా 21 మంది విద్యార్థులను కంపెనీ వారు ఎంపిక చెయ్యడం జరిగింది. వీరికి జూనియర్ టెక్నీషియన్ గా మూడు లక్షల వార్షిక వేతనంతో కంపెనీ వారు నియామక పత్రాలను ప్రిన్సిపాల్ డా. ఎస్.హెచ్.వి. ప్రసాదరావు చేతుల మీదుగా అందజేశారు. ఇదే రోజు హైదరాబాద్ కి చెందిన "మాగ్నెక్ సాఫ్ట్ వేర్" కంపెని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శీలం శంకరయ్య, హెచ్ ఆర్ మేనేజర్లు సోనియా, భార్గవి లు బీటెక్ విద్యార్థులకు వ్రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, గ్రూప్ డిస్కషన్ మరియు ఇంటర్వ్యూలను నిర్వహించారు. వీటికి 85 మంది విద్యార్థులు హాజరు కాగా 15 మంది విద్యార్థులు సాఫ్ట్ వేర్ ఇంటర్న్ పోస్ట్ కి



ఎంపికయ్యారు. వీరి వార్షిక ఆదాయం ఐదు లక్షల రూపాయలుగా సీ.ఈ.ఓ శంకరయ్య నియామక పత్రాలను అందజేశారు. నియామకం పొందిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్ కుమార్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎస్.నవీన్ కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ డిపార్ట్మెంట్ ట్రైనర్లు మరియు విభాగాధిపతులు అభినందించారు.

# కూడలి తిరుణాలకు కొబ్బరి చిప్పల వేలంపాట



**నందిగామ,జనవరి 24 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని దామలూరు కూడలి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి కి నాలుగు రోజులు పాటు జరిగే తిరణాల మహోత్సవాలకు కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించారు.శనివారం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా జరిగిన బహిరంగ వేలం పాటలు జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన ఆళ్ల వీరబాబు 60,500/–రూపాయలకు పాటను దక్కించుకున్నారని ఆలయ ఈవో నారాయణ నర్సింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గింజపల్లి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# జనవరి 26 వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు..

- శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానము పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం..




**గుడివాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** జనవరి 26 రోజున గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలనీ శ్రీ విఘ్నేశ్వర స్వామి వారీ దేవస్థానము పాలక వర్గం కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మెయిన్‌రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారీ దేవస్థానము నందు కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ వాసు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ సాయన రాజేష్ నేతృత్వంలో ధర్మకర్తల మండల సమావేశం నిర్వహించారు. తొలుత దేవస్థానం యొక్క జమాఖర్చులు పరిశీలించి.. సమావేశంలో ఆమోదించడం జరిగింది. ముఖ్యంగా జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా వైభవంగా చేయాలనీ తీర్మానించారు. మరియు నివేదన శాల ఆఫీసు రూము దాతల సహకారంతో నిర్మాణానికి ఏకగ్రీవంగా తీర్మానానికి ఆమోదించారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తలు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, రమణమూర్తి, పోతురాజు, వీరమాచినేని శైలజ, విజయలక్ష్మి, శారద, దుర్గ భవాని మరియు ఆలయ అధికారి పి వి మురళి తదితరులు పాల్గొన్నారు.

# బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.. డాక్టర్ శివరామకృష్ణ..




**చల్లపల్లి/అవనిగడ్డ,జనవరి 24 (వార్తాప్రభ) :** బాలికల సంరక్షణ, వారి హక్కులు, ఆరోగ్యం,విద్య, సామాజిక ఎదుగుదల పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పురిటిగడ్డ పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ శివరామకృష్ణ అన్నారు.శనివారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలి పరిధిలోని పురిటిగడ్డ పిహెచ్ సి వద్ద నుంచి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ, మానవజాతి వికాసానికి మహిళల ఆవశ్యకతను వివరించారు.బాలికలకు సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు.ఈకార్యక్రమంలో సిహెచ్ఓ సుమతి, హెచ్ బారతి , ఫార్మసిస్ట్ శ్రీనివాసరావు,తుడిచేసి విజయకుమార్, ఎఎన్ఎంలు, అసిస్టెంట్ ఎఎన్ఎంలు, పిహెచ్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శ ముద్రగడ



**రౌతులపూడి,జనవరి 24 (వార్తాప్రభ) :** ప్రత్తిపాడు నియోజకవర్గ రౌతులపూడి మండలంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ముద్రగడ పద్మనాభం ,ఆయన తనయుడు గిరిబాబులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు వాసిరెడ్డి జమీలు,అలాగే ములగపూడి గ్రామంలో మాజీ ఎంపీటీసీ అంకం రెడ్డి సతీష్ సోదరుడు అంకంరెడ్డి రామకృష్ణ ఇటీవల మరణించారు. ఇరువురి కుటుంబాలకు పీఏసీ నాయకులు ముద్రగడ పద్మనాభం వారి తనయుడు గిరిబాబులు పరామర్శించి,వారి ఆత్మకు శాంతి చేకూరాలని తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాపర్తి రామకృష్ణ ,వాసిరెడ్డి భాస్కర్ బాబు, అత్యర్తి సాంబమూర్తి ,సోమరౌతు రాజా, గొల్లు చిన్న దివాణం ,గొల్లు వెంకటరమణ ఆయాగ్రామ వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ది భూ యజ్ఞం కాదు.. రైతుల భూములను స్వాహా యజ్ఞం...

- సిరీసర్వే పేరుతో పేదల భూములు కొట్టేసేందుకే... ● తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తోనే జగన్ రెడ్డికి 11 సీట్లకు పరిమితం... ● టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేసిన చంద్రన్న ప్రభుత్వం.... ● రాష్ట్రంలో రైతన్నలు చంద్రన్నకు జై జైలు పలుకుతున్నారు ... ● టిడిపి రాష్ట్ర అధికారి ప్రతినిధి పాతర్ల రమేష్....

**అమరావతి,జనవరి 24 (వార్తాప్రభ) :** రాష్ట్రం లో రైతులు కంటికి రెప్పలా చూసుకుంటూ, కన్నతల్లిలా కాపాడుకునే భూములను సమగ్ర సర్వే పేరుతో అస్తవ్యస్తం చేసి తాత ముత్తాతల నుంచి ఉన్న హక్కులను కూడా కాలరాసి నిస్సిగ్గుగా, అదో పెద్ద ఘనకార్యంగా జగన్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తీవ్ర స్థాయిలో విమర్శించారు అమరావతిలో శనివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ భూయజ్ఞం పేరుతో రైతుల భూములను స్వాహా చేశారని యజ్ఞం అంటే అంటే త్యాగం. కానీ నువ్వు చేసింది స్వాహా చేసే యజ్ఞమని ప్రజల ఆస్తులు దిగమింగే యజ్ఞమని ఆయన విమర్శించారు రీసర్వే పేరుతో శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు వైసీపీ నేతలు చేసిన భూదందాకు, పేదల భూములు కొట్టేసేందుకు తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తోనే జగన్ రెడ్డిని 11 సీట్లకు రాష్ట్ర ప్రజలు పరిమితం చేశారని ఆయన ఎద్దేవా చేశారు రైతులతో మమేకమై జరపాల్సిన రీసర్వేను అస్తవ్యస్తం చేసి ఉన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలు సృష్టించారని. ఈరోజు రాష్ట్రంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలకు ముమ్మాటికీ కారణం జగన్ రెడ్డే అని ఆయన ఆరోపించారు ఇడుపులపాయలో అసైన్డ్ భూముల కుంభకోణం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రప్రదేశ్లో నీ భూ అక్రమాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన తెలిపారు 2018 నవంబర్ 20న నాటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు నువ్వు కూల్చేసిన ప్రజావేదిక సాక్షిగా దేశంలోనే మొట్టమొదటిసారిగా "భూదార్" కార్యక్రమాన్ని ప్రారంభించి ఒక్కో భూమికి ఆధార్ తరహా 11 అంకెల సంఖ్యను అందించి రైతుల భూరికార్డులను సురక్షితంగా అందించే కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. దశాబ్దాలుగా నెలకొన్న భూవివాదాలకు శాశ్వత భూహక్కు, విశిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చే ఈ కార్యక్రమాన్ని అటకెక్కించి "జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష" అనే కార్యక్రమాన్ని చేపట్టి మా క్రెడిట్ కొట్టేసిన క్రిమినల్



నువ్వు కాదా? అని ఆయన ప్రశ్నించారు ఆ కార్యక్రమమైనా సక్రమంగా వెలగబెట్టావా అంటే అదీ లేదని. దాన్ని కూడా అస్తవ్యస్తం చేశావు. శాశ్వత హక్కులు దేవుడెరుగు. ఉన్న హక్కులను దిగ మింగింది నువ్వు కాదా? అని ఆయన ప్రశ్నించారు నువ్వు సీఎంగా ఉన్నప్పుడు నువ్వు పెట్టిన జగనన్న దేశాలతో మీ పార్టీ నేతల భూదానికి మీ సొంత జిల్లా కడప లో ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన చేనేత వర్గానికి చెందిన సుబ్బారావు అతని Often. కూతురు ఆత్మహత్య తీసుకున్న విషయం వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు సర్వే నంబర్ 218 7/2 లో 3.10 ఎకరాలు కడప రేణిగుంట హైవే పక్కన ఉన్న భూమిని కొట్టేసేందుకు ఆ ఫ్యామిలీని రోడ్డున పడేశారని ఆయన విమర్శించారు ఆ కుటుంబము సూస్టడ్ లెటర్ లో కూడా స్పష్టంగా చెప్పారు. వారసత్వంగా సక్రమించిన భూమిని వైసీపీ నేతలు రికార్డులు తారుమారు చేసే లాక్కున్నారని అప్పులు తీర్చలేక కుటుంబంతో సహా ఆత్మ చేసుకుంటున్నట్టు చెప్పారని ఆయన తెలిపారు సొంతంగా వచ్చిన భూమ్మీద కూడా హక్కులు లేకుండా చేసిన ఘనత నీది కాదా జగన్ రెడ్డి? అని ఆయన ప్రశ్నించారు. ప్రైవేటు వ్యక్తుల ఆస్తి పత్రాలపై జగన్ బొమ్మ వేసుకోవడం సిగ్గుచేటు అన్నారు వైసిపి హయాంలో జరిగిన జగనన్న భూ సర్వేలో అడ్డగోలుగా తప్పుల తడకగా పాస్ పుస్తకాలు జారీ చేశారని ఆయన విమర్శించారు సర్వే సమస్యలపై స్పందించే రాష్ట్ర స్థాయి అధికారులు లేదని పొలాల్లో ఈ వ్యవసాయ పనులు చేసుకోవాల్సిన రైతులను రోడ్డు ఎక్కించి వారి హక్కుల కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి సృష్టించింది జగన్ కాదా ?అని ఆయన ప్రశ్నించారు సమాధుల్లో రాళ్లపై చనిపోయిన వారి ఫోటోలు వేసుకున్నట్టు రైతుల పొలాల్లో సొమ్ముతో సర్వే రాళ్లపై జగన్ ఫోటో వేసుకుని అదో ఘనకార్యంగా ప్రచారం చేసుకున్నాడని ఆయన విమర్శించారు

**నీ క్రిమినల్ క్రెడిట్ నీ క్రెడిట్ ఎవరూచోరీ చేయరు..** పిన్నమ్మ తాళిని తెంపిన నీ క్రెడిట్ ఎవరు చోరీ చేయగలరు? 16 నెలల జైల్లో చెప్పకూడుతున్న నీ చరిత్ర ఎక్కడా ? అవినీతి మచ్చ ఎరుగని చంద్రబాబు నాయుడు ఎక్కడ? చంద్రబాబు కృషితో గూగుల్ వస్తే అది నా క్రెడిట్ అంటూ సిగ్గు లేకుండా జగన్ చెప్పుకుంటున్నాడని ఆయన విమర్శించారు ఐటీ పరిశ్రమ తెచ్చిన చంద్రబాబు లోకేషన్ ఎక్కడ? నీ చరిత్ర ఎక్కడ? కూటమి ప్రభుత్వం ఒక పరిశ్రమ తీస్తే నా హయాములు తెచ్చాను అని జగన్ అంటున్నాడని ఉద్యోగాలు ఇస్తే నేను ఇచ్చా?? నేని చ్చినవే అంటావు,సంక్షేమం చేస్తే నేను చేశాను అంటావు అని ఆయనవిమర్శించారు జగన్మోహన్ రెడ్డికి సూటి ప్రశ్న నువ్వు అన్ని చేస్తే నీకెందుకు కేవలం 11 సీట్లు వచ్చాయి? అని ఆయన ప్రశ్నించారు, టిడిపి హయాంలో వెబ్ ల్యాండ్, ఈ పాస్ బుక్కు డిజిటల్ ల్యాండ్, రికార్డ్,వెబ్ ల్యాండ్ ప్రారంభమైన విషయం వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై స్టిక్కర్లు వేయించుకున్న చరిత్ర నీది అని పాతర్లరమేష్ విమర్శించారు

# రాగం మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం..

-పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జ్ వి జగదీశ్వర గౌడ్, బీసీ నేత బేరి రామచంద్ర యాదవ్






**హైదరాబాద్,జనవరి 24 (వార్తాప్రభ) :** నల్లగండ్ల డివిజన్ పరిధిలో ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్, కాంగ్రెస్ నల్లగండ్ల డివిజన్ ఆధ్వర్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాగం మల్లికార్జున్ యాదవ్ నేతృత్వంలో, స్కంద హాస్పిటల్స్ వారి సౌజన్యంతో గుల్మోహర్ పార్క్ లైబ్రరీ వద్ద ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ మొక్కలు నాటి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు వైద్యుల సలహాలు, అవసరమైన మందుల ఉచిత పంపిణీ జరిగింది. అలాగే ప్రభుత్వ ఆరోగ్య భీమా పథకాలకు సంబంధించిన దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యం కల్పించారు. ఈ శిబిరానికి కాలనీ వాసులు సుమారు 280 మందికి పైగా హాజరై వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో గుల్మోహర్ పార్క్ గుల్మోహర్ కాలనీ ప్రెసిడెంట్ ఖాసీం , ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, ప్రభాకర్ చారి, రామేశ్వరమ్మ, నేతాజీ నగర్ ప్రెసిడెంట్ రాంచందర్ యాదవ్, కాలనీ సభ్యులు మల్లేష్ ముదిరాజ్ , రాధా రాణి , జయ ఎడ్డి , రజిత గారు, సత్యమ్మ , లక్ష్మి , పద్మ , సరళ , అనసూయ , సీత , మానిలా తదితరులు పాల్గొన్నారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్యులు, నిర్వాహకులు, స్వచ్ఛంద కార్యకర్తలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవం పాదయాత్ర / సండేస్ ఆన్ సైకిల్ - 2026




**విజయవాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ (మేరా యువ భారత్) ఆధ్వర్యంలో " "మై భారత్‌లిలిమై ఓట్" అనే నినాదంతో జాతీయ ఓటర్ల దినోత్సవం పాదయాత్ర / సండేస్ ఆన్ సైకిల్ – 2026 కార్యక్రమాన్ని 25 జనవరి 2026 న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రాజధానులు మరియు జిల్లా కేంద్రాలలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం లక్ష్యం యువతలో ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ముఖ్యంగా మొదటిసారి ఓటు హక్కు పొందిన యువ ఓటర్లలో అవగాహన కల్పించడం. ఓటరు అవగాహనను శారీరక ధృఢత్వం మరియు సామూహిక భాగస్వామ్యంతో అనుసంధానం చేస్తూ, జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని యువత నాయకత్వంలో ఒక విస్తృత ప్రజా ఉద్యమంగా మార్చడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం ద్వారా యువ పౌరుల్లో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడం, ఓటరు నమోదు మరియు ఓటరు వివరాల సవరణలను ప్రోత్సహించడం, అలాగే ప్రజాస్వామ్య విలువలను గ్రామీణ స్థాయిలో బలపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పాదయాత్ర / సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం సామూహిక పౌర చర్య ద్వారా ఓటరు అవగాహన సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఒక ప్రభావవంతమైన వేదికగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో వీ దీప్తుతీఫ్ వాలంటీర్లు మరియు మొదటిసారి ఓటు హక్కు పొందిన యువ ఓటర్లు చురుకుగా పాల్గొంటారు. పాదయాత్రలు లేదా సైకిల్ ర్యాలీలు, మొదటిసారి ఓటర్లను సత్కరించడం, ఓటరు అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞా స్వీకార కార్యక్రమాలు మరియు ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఇలాంటి ప్రజాస్వామ్య కార్యక్రమాలలో యువత భాగస్వామ్యం దేశ నిర్మాణానికి అత్యంత కీలకం. ఎన్నికల ప్రక్రియ పట్ల యువతలో అవగాహన, బాధ్యత మరియు స్వామ్యత భావనను పెంపొందించడం ద్వారా ప్రజాస్వామ్య పునాదులు మరింత బలపడతా యి. ఈ కార్యక్రమం ద్వారా యువత ప్రజాస్వామ్య విలువలకు మరియు బాధ్యతాయుత పౌరసత్వానికి ప్రతినిధులుగా ఎదగాలని ప్రోత్సహించబడుతున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పాదయాత్ర / సండేస్ ఆన్ సైకిల్ -- 2026 కార్యక్రమంలో యువత అంతా చురుకుగా పాల్గొని, భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని "మై భారత్ " కోరుతోందనీ జిల్లా యువజన అధికారి ఎస్.రాము ఒక ప్రకటనలో తెలిపారు

# పారిశుద్ధ్యమే ప్రజారోగ్యానికి పునాది

● కార్మికురాలిగా మారిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ● యాప్రాన్, గ్లోవ్స్ ధరించి కాలువల్లో వ్యర్థాల తొలగింపు ● పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేసిన తంగిరాల సౌమ్య






**నందిగామ,జనవరి 24 (వార్తాప్రభ) :** పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్వయంగా పారిశుద్ధ్య కార్మికురాలిగా మారి శ్రమించారు. శనివారం పట్టణంలోని బాబు జగజీవన్ రాం బిల్డింగ్ ఆవరణలో ఉన్న మెయిన్ డ్రైన్?లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి యాప్రాన్, గ్లోవ్స్ ధరించి దంత మరియు గంటె పట్టుకొని కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా సాధారణ కార్మికురాలిగా నిలిచి పనిచేయడం ద్వారా పారిశుద్ధ్య ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి ప్రధాన ధ్యేయం కావాలి. శుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి మూలాధారం అని అన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ప్లకార్డులు పట్టుకొని పారిశుద్ధ్యాన్ని కాపాడుదామని ప్రతిజ్ఞ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని, వారి కృషిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందనను రాబట్టి, పారిశుద్ధ్యంపై అవగాహన పెంచే దిశగా కీలకంగా నిలిచిందని స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్, పారిశుద్ధ్య సిబ్బంది,కూటమి నేతలు, స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామికి విశేషాభిషేకాలు...

● నేడు రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్న దేవదేవుడు





**గుడ్లవల్లేరు,జనవరి 24 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేక సేవలు నిర్వహించారు. ఆదివారం రథసప్తమిని పురస్కరించుకుని ముందు రోజు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. పంచామృతంతో నిర్వహించిన అభిషేకాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా భక్తులను వేదపండితులు ఆశీర్వదించటంతో పాటు తీర్థ ప్రసాదాలు అందచేశారు. రథసప్తమిని పురస్కరించుకుని దేవదేవుడు ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి రాజగోపురం ఎదురుగా భక్తులకు సూర్యప్రభ వాహనంలో దర్శనం ఇస్తారు. సాయంత్రం చంద్ర ప్రభ వాహనంలో గ్రామంలో విహరిస్తారు. ఆదివారం రథసప్తమి రావటం విశేషమని, ఈ విశేషమైన రోజున భక్తులు సూర్యప్రభ వాహనంలో ఆసీనుడైన శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే మంచిదని వేద పండితులు వివరించారు.

# 30న జేఎన్టీయూ కాకినాడకు రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రాక

**కాకినాడ,జనవరి 24 (వార్తాప్రభ) :** ఈ నెల 30వ తేదీన కాకినాడలోని జవహర్?లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ)లో రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో నేరుగా ఇంట్రాక్ట్ అయ్యే 'హలో లోకేష్' కార్యక్రమం ఖరారైంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ ప్రోగ్రాం కో-ఆర్డినేషన్ బృంద సభ్యులతో కలిసి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, జేఎన్టీయూ వైస్? ఛాన్సలర్ ప్రొఫెసర్ సిఎస్?ఆర్ ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమం నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, విద్యార్థుల భాగస్వామ్యం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయ్యే ప్రాంగణాన్ని, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న హాస్టల్ సముదాయాన్ని పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే అనంత లక్ష్మి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కిటకిటలాడుతున్న తిరుమల.. సర్వదర్శనానికి 24 గంటలు

**తిరుమల,జనవరి 24 (వార్తాప్రభ) :** కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి కొలువుదీరిన పుణ్యక్షేత్రం తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామి వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో తిరుమల జనసంద్రంగా మారింది. కొండపై ఉన్న అన్ని కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. మరోవైపు, స్వామి వారిని నిన్న 69,726 మంది భక్తులు దర్శించుకున్నారు. మొత్తం 27,832 మంది తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల రూ. 4.12 కోట్ల హుండీ ఆదాయం వచ్చింది.

# మోపిదేవి పుణ్యక్షేత్రంలో ప్రముఖ సినీ హీరో నారా రోహిత్..

● ప్రముఖ సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు ఆహ్వానం మేరకు మోపిదేవి వచ్చిన నారా రోహిత్.

● నిర్మాత నారాయణరావు బహుకరించిన రూ.కోటి విలువైన నూతన టేకు రథం ప్రారంభించిన నారా రోహిత్.





**మోపిదేవి/అవనిగడ్డ,జనవరి 24 (వార్తాప్రభ) :** ప్రముఖ సినీ హీరో నారా రోహిత్ శనివారం మోపిదేవిలోని సుప్రసిద్ధ స్వయంభూ శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శించుకున్నారు. ప్రముఖ సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు ఆహ్వానం మేరకు హీరో రోహిత్ మోపిదేవికి వచ్చారు. ఆయనకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు, మోపిదేవి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, దేవాదాయ శాఖ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా హీరో రోహిత్ దేవస్థానంలోని స్వామి వారి నాగపుట్టలో పాలు పోసి పూజలు చేశారు. నూతన టేకు రథ శిఖరానికి హీరో రోహిత్, మండలి వెంకట్రామ్, దాత, సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు దంపతులచే బ్రహ్మశ్రీ కొమ్మూరి ఫణికుమారశర్మ, ఘనాపాటి నౌదూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ, దేవస్థానం ప్రధాన అర్చకులు బుద్ధు పవన్ కుమార్ శర్మ అభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా నిర్మాత అట్లూరి నారాయణరావు బహుకరించిన రూ.కోటి విలువైన నూతన టేకు రథాన్ని రోహిత్ ప్రారంభించారు. అర్చకులు టేకు రథంపై నూతన శిఖర ప్రతిష్ట చేశారు. అనంతరం హీరో నారా రోహిత్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. ఆయనకు డిప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు, అర్చకులు సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ అచ్యుత మధుసూధనరావు,తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం అభినందనీయం : నూజివీడు సివిల్ జడ్జి అనూష





**హనుమాన్ జంక్షన్,జనవరి 24 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఆరోగ్యం పట్ల నిర్లక్షం వహిస్తున్నారని నూజివీడు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఓ.అనూష అన్నారు. హనుమాన్ జంక్షన్ లోని ఇటీవల నూతనంగా ప్రారంభించిన మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ లో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉచిత వైద్యశిభిరాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోట్లాది రూపాయలు వ్యయం చేసి గ్రామీణ ప్రాంతంలో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ నిర్మించటం అభినందించదగ్గ విషయమన్నారు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యాన్ని పేదల వద్దకు తీసుకువెళుతున్న మెడివ్యాలీ మేనేజింగ్ డైరెక్టర్ పంచకర్ల చక్రవర్తిని అభినందించారు. ఈ శిభిరం లో ప్రత్యేకంగా బి.ఎం డి, మరియు విటమిన్ డి 3 పరీక్షలు చేశారు. అలాగే సుగర్ పేషేంట్స్ కి నరాల సమస్యను సులభంగా గుర్తించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ తో పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో బి ఎం. డి, పరీక్షలు 276 మంది, డి 3 పరీక్షలు 127 మంది, న్యూరోపతి టెస్ట్ లు 276 మంది వినియోగించుకున్నారు. మెడివ్యాలీ మేనేజింగ్ డైరెక్టర్ చక్రవర్తి పశీచకర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిభిరం లో డాక్టర్ శ్రీవర్ధన్,డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ పంచకర్ల సుధ పరీక్షలు నిర్వహించారు. అలాగే జెనరల్ మేనేజర్ పోలిశెట్టి వీరజ్యోతి,ఆపరేషన్స్ మేనేజర్ కొప్పర్తి మహేష్, మార్కెటింగ్ మేనేజర్ నాగేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొని తమ అమూల్యమైన సేవలను అందించారు.

# స్వచ్ఛత కోసం మేము సైతం..

-శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం.






**చల్లపల్లి/అవనిగడ్డ: జనవరి 24 (వార్తాప్రభ) :** పరిసరాలు,వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించవచ్చని సర్పంచ్,ఎపిఐడిసి డైరెక్టర్ పైడిపాముల కృష్ణ కుమారి పెర్కొన్నారు. చల్లపల్లి శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆద్వర్యంలో స్థానిక పెదకళ్ళెపల్లి రోడ్డుకు ఇరువైపులా పెరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించి స్థానికులు,ప్రముఖులు ప్రశంశలు అందుకున్నారు. స్వచ్ఛత కోసం మేము సైతం అంటూ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ కుమారి , ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్ బాబు , వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివ రావు పాల్గొని తమవంతు సేవలు అందించారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా తమ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించి అధికార, అనధికార ప్రముఖుల ప్రశంసలు అందుకోవడం పట్ల కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివరామ ప్రసాద్ హర్షం వ్యక్తం చేయడంతో పాటు ఎన్ఎస్-ఎస్ యూనిట్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# అంగన్వాడీ కార్యకర్తలు సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**మైలవరం,జనవరి 24 (వార్తాప్రభ) :** ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు నందు అంగన్వాడీ కేంద్రాలలో కార్యకర్తలు, సహాయకు రాలు(ఆయా) పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తు న్నట్లు ఇంచార్జ్ సిడిపివో డి.జోజి కటాక్షం శనివారం ప్రకటనలో తెలిపారు. మైలవరం ప్రాజెక్టు పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలం జుపూడి భీమేస్వరకాలని ఏరియా కోడ్ నెంబర్ 0613181 బిసి-ఎ కేటగిరిలో అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ కి, జి.కొండూరు మండలంలోని దుగ్గిరాలపాడు-2 కోడ్ నంబర్ 0613166 బిసి-డి కేటగిరిలో అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ కి అలాగే మైలవరం మండలం మొరుసుమిల్లి తండా ఏరియా కోడ్ నంబర్ 0613185 అంగన్వాడీ కేంద్రంలో ఎస్.టి కేటగిరి లో అంగన్వాడీ సహాయకురాలు(ఆయా), మైలవరం మండలంలోని చిలుకురివారి గూడెం కోడ్ నంబర్ 0613163 అంగన్వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరిలో అంగన్వాడీ సహాయకురాలు, మైలవరం మండలంలోని పి.చంద్రగూడెం గ్రామంలోని కోడ్ నంబర్ 0613034 అంగన్వాడీ కేంద్రం-1 లో బిసి-బి కేటగిరిలో అంగన్వాడీ సహాయకురాలు,మైలవరం మండలం కేంద్రంలోని దేవునిచెరువు-1 లో కోడ్ నంబర్ 0613001 అంగన్వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరిలో అంగన్వాడీ సహాయ కురాలు,మైలవరం మండలంలోని సిద్దిపేట ఏరియా కోడ్ నంబర్ 0613005 అంగన్వాడీ కేంద్రంలో ఎస్.సి కేటగిరిలో ఆయా (సహాయకురాలు), జి. కొండూరు మండలంలోని కోడూరు గ్రామంలో కోడ్ నంబర్ 0613167 అంగన్వాడీ కేంద్రంలో బిసి-డి కేటగిరిలో అంగన్వాడీ సహాయకురాలు, ఇదే మండలంలో ని కోడూరు గ్రామ శివారు కె.కంద్రిక గ్రామంలోని కోడ్ నంబర్ 0613168 అంగన్వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరీలో సహాయకురాలు, చిన నందిగామ గ్రామంలోని కోడ్ నెంబర్ 0613062 అంగన్వాడి కేంద్రం-1 లోని ఎస్సీ (గ్రూప్-3) కేటగిరిలో సహాయకురాలు, జి.కొండూరు మండలంలోని కోడ్ నంబర్ 0613049 వెలగలేరు-2 అంగన్వాడీ కేంద్రంలో ఎస్సీ(గ్రూప్-2) కేటగిరిలో అంగన్వాడీ ఆయా (సహాయకురాలు),ఇదే మండలంలోని దుగ్గిరాల పాడు గ్రామంలోని కోడ్ నెంబర్ 0613166 అంగన్వాడీ కేంద్రం-2 లో బిసి-డి కేటగిరిలో సహాయకురాలు, జి కొండూరు మండలంలోని గడ్డ మ-ంనుగు గ్రామ శివారు గాంధీ క్యాంపు కోడ్ నెంబర్ 0613170 అంగన్వాడీ కేంద్రంలో ఎస్.సి (గ్రూప్-2) కేటగిరిలో సహాయకురాలు, పినపాక గ్రామంలోని కోడ్ నంబర్ 0613082 అంగన్వాడీ కేంద్రంలో ఎస్.సి(గ్రూప్-3),ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలోని సత్యనారాయణపురం ఏరియా కోడ్ నెంబర్ 0613183 అంగన్వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరీ లో అంగన్వాడీ సహాయకురాలు(ఆయా), గుంటుపల్లి గ్రామంలోని కోడ్ నంబర్ 0613120 అంగన్వాడి కేంద్రం-5 లో జనరల్ కేటగిరిలో అంగన్వాడీ సహాయకురాలు, ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామంలోని కోడ్ నెంబర్ 0613145 అంగన్వాడి కేంద్రం-1 లో బిసి-ఇ కేటగిరిలో అంగన్వాడీ సహాయకురాలు,ఇదే మండలంలోని జూపూడి భీమేస్వరకాలనీలో కోడ్ నెంబర్ 0613181 అంగన్వాడీ కేంద్రంలో బిసి-ఎ కేటగిరి లో సహాయకురాలు,కొత్త చిలుకూరు గ్రామంలో కోడ్ నంబర్ 0613182 అంగన్వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరి లో సహాయకురాలు,ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామంలో కోడ్ నెంబర్ 0613175 కొండపల్లి అరుణ సాగర్ ఏరియా అంగన్వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరి లో సహాయకురాలు, తుమ్మలపాలెంగ్రామంలో కోడ్ నంబర్ 0613112 అంగన్వాడీ కేంద్రం-3 లో జనరల్ కేటగిరిలో సహాయకురాలు,రెడ్డిగూడెం మండలంలోని ముచ్చెనపల్లి గ్రామంలో కోడ్ నంబర్ 0620202 అంగన్వాడీ కేంద్రంలో బిసి-ఎ కేటగిరిలో సహాయకురాలు,రెడ్డిగూడెం మండలంలోని రెడ్డికుంట లో కోడ్ నంబర్ 0620203 అంగన్వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరీలో సహాయకురాలు,రెడ్డిగూడెం మండలంలోని మిట్టగూడెం గ్రామం కోడ్ నంబర్ 0620205 అంగన్వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరిలో సహాయకురాలు పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడం జరిగిందని ఇంచార్జ్ సిడిపివొ డి. జ్యోతి కటాక్షం వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలలో పైన తెలిపిన అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు 01.07.2026 నాటికి 21 సంవత్సరాలు నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి 10 వ తరగతి ఉత్తీర్ణులై స్థానికంగా వివాహితరాలై ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల కొరకు ఎస్సీ ఎస్టీ బిసి కులధృవీకరణ పత్రాలు, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డుల నకళ్ళ ను, పాస్ పోర్ట్ సైజ్ కలర్ ఫోటోలు ధరఖాస్తు ఫారంతో జత చేసి ఫిబ్రవరి 5, 2026 తేదీ సాయంత్రం 5 గంటల లోపు మైలవరం సిడిపివో కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని సిడిపివో ప్రకటన లో తెలిపారు. అన్ని జిరాక్స్ కాపీల పైన గజిటెడ్ అట్టేస్టేషన్ చేయించి రెండు సెట్లు సమర్పించాల ని సిడిపివో స్పష్టంచేశారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188